# ప్రజాశక్తి

బుధవారం 7 మే 2025 | 8 పేజీలు | ఎన్‌టిఆర్ | కృష్ణా








కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి కొల్లు రవీంద్ర

## నిషేధిత భూములకు విముక్తి

**• మంత్రి కొల్లు రవీంద్ర**

**ప్రజాశక్తి - కలెక్టరేట్ (కృష్ణా) :** ఎన్నో ఏళ్లుగా ప్రభుత్వ భూములుగా ఉండిపోయిన 22 (ఏ) నిషేధిత జాబితాలోని భూములకు విముక్తి కలిగించి వాటిపై సర్వహక్కులు కల్పించామని రాష్ట్ర గనులు భూగర్భవనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. మంత్రి కొల్లు రవీంద్ర... కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ చైర్మన్ బండి రామకృష్ణతో కలిసి మచిలీపట్నం 4, 5 డివిజన్ల సర్కారు వారి తోట పరిధిలో ఉన్న సెక్షన్ 22 (ఏ)లో నమోదైన భూములకు మినహాయింపు ఉత్తర్వులు విడుదల చేసే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ బ్రిటిష్ వారి కాలంలో ఏర్పాటై సర్కార్ వారి తోటగా పిలవబడిన ఈ ప్రాంతంలోని భూములు 22(ఏ) నిషేధిత జాబితాలో ఉండటం వల్ల కాలనీవాసులకు రిజిస్ట్రేషన్ చేసుకొనేందుకు ఇప్పటివరకు అవకాశం లేకపోయిందన్నారు. అత్యవసర సమయంలో రుణాల కోసం లేదా విక్రయించుకోవడానికి సాధ్యపడక ప్రజలు ఎన్నో ఇబ్బందులను పడ్డారని మంత్రి గుర్తుచేశారు. అటువంటి ఇబ్బందుల నుంచి వారిని గట్టెక్కించడానికి, ఎన్నికల్లో వారికి ఇచ్చిన హామీ ప్రకారం మేరకు వారి భూములను 22(ఏ) నిషేధిత జాబితా నుంచి తొలగించి దాదాపు 340 మందికి పూర్తి హక్కులు కల్పించి అందుకు సంబంధించిన ఉత్తర్వులను లబ్ధిదారులకు అందించామని తెలిపారు. రహదారులు, పార్కులు, చర్చిలు, గుళ్ళు తదితర కమ్యూనిటీ ఆధారిత భూములను సబ్ డివిజన్ చేసి, వ్యక్తిగత భూములకు ప్రత్యేక సర్వే నంబర్ కేటాయించినట్లు తెలిపారు. అలాగే మిగతా ప్రాంతాలలో కూడా రెవెన్యూ సమస్యలున్న భూములను గుర్తించి వారికి న్యాయం చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. కలెక్టర్ డికె బాలాజీ మాట్లాడుతూ నిషేధిత జాబితా భూములకు విముక్తి కల్పించామన్నారు. అనంతరం కాలనీవాసులు మంత్రి కొల్లు రవీంద్రను, జిల్లా కలెక్టర్‌ను సన్మానించి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈకార్యక్రమంలో బందరు ఆర్‌డిఒ కె.స్వాతి, మచిలీపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కుంచె నాని, కార్పొరేటర్ ఛాయాదేవి, మచిలీపట్నం నార్త్ మండలం తహశీల్దార్ నాగభూషణం, మాజీ మున్సిపల్ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, జిల్లా గ్రంధాలయ సంస్థ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్, నగర పాలక సంస్థ కమిషనర్ బాపిరాజు, మాజీ డిప్యూటీ కలెక్టర్ విజయ్ శేఖర్, పార్టీ ఇన్చార్జి రత్నాకర్, మాజీ కౌన్సిలర్ చంటి తదితరులు పాల్గొన్నారు.

# మలివిడత సమీకరణకు కసరత్తు

**• రాజధానికి 14 గ్రామాల్లో మరో 44 వేల ఎకరాల గుర్తింపు • మూడు గ్రామాల్లో ముగిసిన గ్రామ సభలు**

**ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి**

రాజధాని నిర్మాణంలో భాగంగా మలివిడత భూ సమీకరణకు ప్రభుత్వం ముమ్మరంగా కసరత్తు చేస్తోంది. తుళ్లూరు, అమరావతి, తాడికొండ, మంగళగిరి, పెదకాకాని మండలాల్లోని దాదాపు 14 గ్రామాల్లో ఈసారి భూ సమీకరణ జరగనుంది. 2015లో తుళ్లూరు మండలంలో జరిగిన తొలి విడత భూ సమీకరణలో పెండింగ్‌లో ఉన్న వడ్డమాను, హరిశ్చంద్రపురం, పెదపరిమి గ్రామాల్లో కూడా ఈసారి సమీకరణలో భూములు తీసుకోనున్నారు. అమరావతి మండలం వైకుంఠపురం, యండ్రాయి, పెదమద్దూరు, కర్లపూడి గ్రామాలను ఎంపిక చేశారు. ఇటీవల కర్లపూడి తప్ప మిగతా మూడుగ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించారు. భూ సమీకరణపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. కొంతమంది వ్యతిరేకించినా పలువురు సానుకూలత తెలిపారు. అలాగే తాడికొండ, కంతేరు, నిడుముక్కల, పొన్నెకల్లు, రావెల గ్రామాల్లో కూడా సమీకరణకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. రైల్వే లైను నిమిత్తం ఈ ప్రాంతాల్లో ఎక్కువగా భూమిని తీసుకోనున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. అలాగే మంగళగిరి మండలం కాజతోపాటు మరికొన్ని గ్రామాల్లో కూడా సమీకరణకు సన్నాహాలు చేస్తున్నారు. పెదకాకాని మండలం నంబూరును కూడా ఎంపిక చేశారు. ఖమ్మం జిల్లా ఎర్రుబాలెం నుంచి నంబూరు వరకు నేరుగా రైల్వే లైను ఏర్పాటు అవుతుండటం, నంబూరును ప్రధాన జంక్షన్‌గా మార్చాలన్న ప్రతిపాదనలతో భూముల సమీకరణను కసరత్తు చేస్తున్నారు. అలాగే అంతర్జాతీయ విమానాశ్రయం కూడా తాడికొండ, మేడికొండూరు మండలాల మధ్య ఏర్పాటు అవుతుందనే ప్రచారంతో ఈ ప్రాంతంలో భూములకు గిరాకీ పెరిగింది. ఓ సినీనటుడు తన వ్యాపార సంస్థల పేరుతో తాడికొండ, మేడికొండూరు మండలాల్లో ఇటీవల 200 ఎకరాల భూమిని కొనుగోలు చేశారు. మొత్తంగా 44 వేల ఎకరాల భూ సమీకరణతో ఆయా గ్రామాల్లో కలకలం రేగుతోంది. ఏయే భూములు ఎంపిక చేశారో తెలుసుకునేందుకు రైతులు రెవన్యూ కార్యాలయాలకు పరుగులు పెడుతున్నారు. రాజధానిలో భూ సమీకరణ వల్ల రైతులకు ధరలు పెరిగినా ఇంత వరకు అభివృద్ధి చేసిన ప్లాట్లు అప్పగించకపోవడంతో వారిలో కొంత అయోమయం నెలకొంది. 2015 జనవరిలో ప్రారంభమైన భూ సమీకరణలో 37,941 ఎకరాలకుగాను 34,689 ఎకరాలను సిఆర్‌డిఎకు రైతులు అప్పగించారు. మరో 3,252 ఎకరాలు ఇవ్వడానికి దాదాపు వెయ్యి మంది రైతులు సుముఖత వ్యక్తం చేయలేదు. భూ సమీకరణలో తీసుకున్న 34,689 ఎకరాలతోపాటు ప్రభుత్వ భూములు మరో 17 వేల ఎకరాలు కూడా రాజధానికి వినియోగించుకునేందుకు సిఆర్‌డిఎ తన అధీనంలోకి తీసుకుంది. మొత్తంగా 51 వేల ఎకరాలు రాజధానికి సిద్ధం చేయగా, ఇంకా 44 వేల ఎకరాలు కూడా సమీకరణకు తీసుకోవడం వల్ల రైతుల్లో ఆందోళన లేకపోలేదు. రాజధాని వెలుపల లావాదేవీలు పుంజుకున్నాయి. రాజధాని గ్రామాల్లో లావాదేవీలు పూర్తిగా మందగించాయి. దీంతో తమ భూములకు ధరలు తగ్గుతాయోమోనన్న బెంగ రైతుల్లో నెలకొంది. అయితే రాజధానిలో భూముల విలువ ఏమాత్రం తగ్గదని, గజం లక్షకు అమ్మిస్తామని, కొంత కాలం వేచి ఉండాలని ప్రభుత్వ పెద్దలు రైతులను సమాధాన పరుస్తున్నారు. అంతేగాక పారిశ్రామిక అవసరాల కోసం రాజధానిలో కన్నా బయట ప్రాంతంల్లో ధరలు తక్కువగా ఉండటం వల్ల ఈ భూములు తీసుకోకతప్పడం లేదని రాజధాని రైతులను కొందరు నాయకులు ఒప్పిస్తున్నారు. రాజధానిలో రైతుల నుంచి భూములు తీసుకున్న సిఆర్‌డిఎ మూడేళ్లలో అభివృద్ధి చేసిన ప్లాట్లు అప్పగిస్తామని రైతులకు హామీ ఇచ్చింది. కానీ వేర్వురు కారణాలతో 10 ఏళ్లయినా ప్లాట్లను అప్పగించలేదు. ఇటువంటి పరిస్థితుల్లో తాము కూడా సమీకరణలో భూములు ఇస్తే తిరిగి రిటర్నబుల్ ప్లాట్లు కోసం ఎంత కాలం వేచి ఉండాల్సి వస్తుందో అన్న భయం కూడా కొత్తగా భూములు ఇవ్వాల్సిన రైతుల్లో నెలకొంది.

రాజధాని అమరావతి ప్రాంతం; మే 2న రాజధాని పునర్నిర్మాణ పనుల ప్రారంభోత్సవం సందర్భంగా ప్రధాని ఆవిష్కరించిన పైలాన్ (కింద)





## విద్యుత్ భారాలపై సిపిఎం సమరం

### విస్తృతంగా సంతకాల సేకరణ

స్మార్ట్ మీటర్లు పెట్టొద్దని, సర్దుబాటు ఛార్జీల పేరుతు పెంచిన కరెంట్ ఛార్జీలను రద్దు చేయాలని, ఆదానీ-సెకీ, యాక్సెస్‌తో ఒప్పందాలను రద్దు చేసుకోవాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యాన మంగళవారం విస్తృతంగా సంతకాల సేకరణ చేపట్టారు. పలుచోట్ల నిరసనలు తెలిపారు. విజయవాడ వన్‌టౌన్ సామారాంగ్ చౌక్ నుండి కాళేశ్వరరావు మార్కెట్ సెంటర్ వరకు ప్రజల సంతకాలు సేకరిస్తూ చైతన్యం చేశారు. కృష్ణలంక 21వ డివిజన్ సత్యంగారి హోటల్ సెంటర్, రైల్వే స్టేషన్ మెయిన్ గేట్, సింగ్ నగర్ డాబా కొట్ల సెంటర్, 17వ డివిజన్ రాణిగారితోట, 50వ డివిజన్ గొల్లపాలెం గట్టు క్వారీ ప్రాంతాల్లో సంతకాల సేకరణ జరిగింది. రైల్వేస్టేషన్ మెయిన్ గేటు వద్ద ఆటో కార్మికులు నిరసన తెలిపారు. ఇళ్ళకు స్మార్ట్ మీటర్లు పెట్టొద్దని కృష్ణలంక 22 డివిజన్‌లో ఇంటింటికీ స్టిక్కర్లను అతికించారు. ఈ కార్యక్రమాల్లో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్, పశ్చిమ, సెంట్రల్, తూర్పు నగర కార్యదర్శులు బోయి సత్యబాబు, బి.రమణరావు, పి.కృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా ఈనెల 7న గుణదల విద్యుత్ సౌధా వద్ద సిపిఎం ఆధ్వర్యంలో జరిగే 'ప్రజాభేరి'ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

(పూర్తి వివరాలు లోపలి పేజీల్లో)



విజయవాడ కృష్ణలంకలో జరిగిన సంతకాల సేకరణలో సిపిఎం నాయకులు దోనేపూడి కాశీనాథ్, పి.కృష్ణ

**విద్యుత్ భారాలు, స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా**

## నేడు విద్యుత్ సౌధ వద్ద సిపిఎం ధర్నా

**ప్రజాశక్తి - విజయవాడ** : విద్యుత్ సర్దుబాటు ఛార్జీల భారాలు రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్లు పెట్టొద్దని, అదానీ-సెకీ, యాక్సిస్ ఒప్పందాలు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఉదయం 10.30 గంటలకు సిపిఎం ఆధ్వర్యాన విజయవాడ ఏలూరు రోడ్డులోని గుణదల విద్యుత్ సౌధ వద్ద ధర్నా జరుగుతుంది. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్ పాల్గొంటారు.




## విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా వైసిపి ధర్నాలు

పెంచిన విద్యుత్ ఛార్జీలను తక్షణమే తగ్గించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం వైసిపి ఆధ్వర్యాన ఎన్‌టిఆర్ జిల్లాలో ధర్నాలు నిర్వహించారు. విజయవాడలోని విద్యుత్ నిలయం సిఎండి కార్యాలయం, ఎస్‌సి కార్యాలయం, కెఎల్‌రావు విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద, జగ్గయ్యపేటలోని ఎడి కార్యాలయం, తిరువూరు సబ్‌స్టేషన్ వద్ద ధర్నాలు నిర్వహించి అధికారులకు వినతిపత్రాలు సమర్పించారు. విజయవాడ సిఎండి కార్యాలయం వద్ద జరిగిన ధర్నాలో వైసిపి ఎన్‌టిఆర్ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్ మాట్లాడుతూ పెంచిన కరెంట్ ఛార్జీలకు వ్యతిరేకంగా నిరసనలను ఉధృతం చేశామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు విద్యుత్ ఛార్జీలు పెంచేది లేదనిహామీ ఇచ్చి మాట తప్పిందన్నారు. సంక్షేమం, అభివృద్ధి లేకపోగా ఛార్జీల మోత మోగిస్తోందన్నారు. ఈ కార్యక్రమాల్లో మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు, ఎంఎల్‌సి రుహెల్లా, మేయర్ రాయన భాగ్యలక్ష్మి, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, డిప్యూటీ మేయర్లు అవుతు శ్రీశైలజారెడ్డి, బెల్లం దుర్గ, వైసిపి జగ్గయ్యపేట నియోజకవర్గ ఇన్చార్జి తన్నీరు నాగేశ్వరరావు, తిరువూరు నియోజకవర్గ ఇన్చార్జి నల్లగట్ల స్వామిదాస్, జడ్‌పి మాజీ చైర్‌పర్సన్ నల్లగట్ల సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

(పూర్తి వివరాలు లోపలి పేజీల్లో)




విద్యుత్ నిలయం సిఎండి కార్యాలయం వద్ద జరిగిన ధర్నాలో వైసిపి ఎన్‌టిఆర్ జిల్లా అధ్యక్షులు దేవినేని అవినాష్ తదితరులు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ

## పారిశ్రామిక వేత్తలతో కలెక్టర్ సమావేశం

**ప్రజాశక్తి - విజయవాడ :** నగరంలోని జిల్లా కలెక్టరేట్‌లో ప్రముఖ పారిశ్రామికవేత్తలు, ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ ఫెడరేషన్ (ఎపిసిసిఐఎఫ్) సభ్యులతో మంగళవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం ఎజెండాలో భాగంగా జిల్లాలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పి-4 (పబ్లిక్, ప్రైవేట్, పీపుల్ పార్టనర్‌షిప్) బంగారు కుటుంబాలు - మార్గదర్శి కార్యక్రమాన్ని అమలు చేయడంపై చర్చించారు. విజయవంతమైన వ్యవస్థాపకులు, కార్పొరేట్లు పేదలు, అణగారిన కుటుంబాలను దత్తత తీసుకోవాలని, ఆర్థిక సహాయంతో పాటు, “మార్గదర్శి” వ్యక్తి/కార్పొరేట్ మద్దతుతో ప్రతి కుటుంబానికి నిరంతర మార్గదర్శక కార్యక్రమాన్ని చేపట్టాలని, ఈ కార్యక్రమాన్ని యుద్ధప్రాతిపదికన చేపట్టేందుకు మార్గదర్శకులు ముందుకు రావాలని ఎపి చాంబర్‌లను కలెక్టర్ కోరారు. ఎపి చాంబర్స్ అధ్యక్షుడు పొట్లూరి భాస్కర్‌రావు, డైరెక్టర్ వెలగపూడి సాంబశివరావు, టూరిజం కమిటీ చైర్మన్ డాక్టర్ తరుణ్ కాకాని, ఎనర్జీ ప్యానెల్ చైర్ ఫణి బుర్రా, కె లక్ష్మీనారాయణ, ఎంఎస్ఎంఇ పార్థసారథి, విద్యా సలహాదారు సుమ అట్లూరి పాల్గొన్నారు.




## నగరంలో యాంటీ మలేరియా ఆపరేషన్లు

**ప్రజాశక్తి-విజయవాడ :** నగరంలో ప్రజలకు దోమకాటు వలన ఎటువంటి అనారోగ్య సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు నగరపాలక సంస్థ ఇన్‌చార్జి కమిషనర్ డాక్టర్ డి చంద్రశేఖర్ ఆదేశాల మేరకు నగరంలో బయాలజీ సూర్యకుమార్ ఆధ్వర్యంలో యాంటీ లార్వే ఆపరేషన్లను విస్తృతంగా చేపట్టారు. విఎంసి మలేరియా సిబ్బంది మంగళవారం ఉదయం 30వ వార్డు దేవి నగర్ బుడమేరు కెనాల్, 57వ వార్డు కొత్త ఆర్ఆర్‌పేట బుడమేరు కాలువ, యంఎల్ ఆయిల్ స్ప్రే, 60వ వార్డు వాంబే కాలనీ కల్వర్ట్ పవర్ స్ప్రే కార్యకలాపాలు, 61వ వార్డు పాయకాపురం చెరువు తూతుకాడ శుభ్రపరిచే పని, గుర్రపు డెక్కలను బోట్ల సహాయంతో శుభ్రం చేశారు. నీటి నిలువలు ఎక్కడా ఉండకుండా చర్యలు తీసుకున్నారు. నీరు నిల్వ ఉంటే దోమ పుట్టుకకు కారణమవుతుందని , ఎప్పటికప్పుడు యాంటీ లార్వా ఆపరేషన్ నిర్వహిస్తూ ప్రజలకు దోమ కాటు వలన ఎటువంటి అనారోగ్య సమస్యలు తలెత్తకుండా అధికారులు పర్యవేక్షిస్తున్నారని ఇన్‌చార్జి కమిషనర్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

## ఠాగూర్ లైబ్రరీని తనిఖీ చేసిన కృష్ణమోహన్

**ప్రజాశక్తి - విజయవాడ :** విజయవాడ ఠాగూర్ గ్రంథాలయంలో వేసవి శిక్షణా తరగతులు, గ్రంథాలయ నిర్వహణ గురించి తెలుసుకోవాడానికి పౌర గ్రంథాలయ సంచాలకులు ఏ.కృష్ణమోహన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. వేసవిశిక్షణా తరగతులకు వచ్చే విద్యార్థులు చిన్నతనం నుండే పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి కంచల నాగరాజు, గ్రేడ్-1 లైబ్రేరియన్ కె.రామాదేవి సిబంది పాల్గొన్నారు.



లైబ్రరీ సిబ్బందితో మాట్లాడుతున్న ఎ.కృష్ణమోహన్

# అర్జీ అంటే కాగితం కాదు.. ప్రజల ఆవేదన

### సిఎంఒ సెల్ చీఫ్ గ్రీవెన్స్ ఆఫీసర్ డాక్టర్ చిన్నారావు

**ప్రజాశక్తి-విజయవాడ :** ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) ద్వారా ప్రజలు సమర్పించే అర్జీని కాగితంలా భావించొద్దని సీఎంవో పీజీఆర్ఎస్ సెల్ చీఫ్ గ్రీవెన్స్ ఆఫీసర్ డాక్టర్ సీహెచ్ చిన్నారావు అన్నారు. నగరంలోని కలెక్టరేట్ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో కలెక్టర్ డా.జి.లక్ష్మీశ ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) జిల్లాస్థాయి అధికారులకు సామర్థ్య నిర్మాణ శిక్షణ వర్క్‌షాప్ జరిగింది. పీజీఆర్ఎస్ ద్వారా గ్రీవెన్స్ రిడ్రెసల్ అధికారి అర్జీని స్వీకరించింది మొదలు నిర్దేశ గడువులో దరఖాస్తుదారుడు పూర్తిస్థాయి సంతృప్తి చెందేలా సమస్యను పరిష్కరించే వరకు వివిధ దశల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వ్యవహరించాల్సిన తీరుపై చీఫ్ గ్రీవెన్స్ ఆఫీసర్ చిన్నారావు సూచనలు చేసి, అధికారుల సందేహాలను నివత్తి చేశారు. ఈ సందర్భంగా చిన్నారావు మాట్లాడుతూ దరఖాస్తుదారుల వేదనగా భావించి పరిష్కరించాలన్న తపన, సహనం ఉన్నప్పుడే అర్జీదారుడు సంతృప్తి చెందేలా సమస్యకు పరిష్కారం లభించి, ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందన్నారు. జిల్లా అధికారులు అర్జీదారులను వారి కుటుంబ సభ్యులుగా భావించి ప్రతి అర్జీకి సరైన పరిష్కారం చూపాలన్నారు. సమస్య పరిష్కార సామర్థ్యం అనేది పాలనపై ప్రజల్లో విశ్వాసం పెంచుతుందని, ప్రతి అర్జీని సానుభూతితో, నిజాయితీగా పారదర్శకత, జవాబుదారీతనంతో పరిష్కరించాలన్నారు. అర్జీ అంటే ఒక కాగితం కాదు.. దాని వెనుక కొందరి జీవితాలు, ఉద్వేగాలు, ఆవేదనలు ఉంటాయన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. ప్రతి శాఖకు మండల స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు గ్రీవెన్స్ రిడ్రెసల్ అథారిటీగా ఒకరికి బాధ్యతలు అప్పగించినట్లు చెప్పారు. అర్జీని కిందిస్థాయి అధికారికి అప్పగించకుండా గ్రీవెన్స్ రిడ్రెసల్ అధికారే అర్జీదారునితో ఫోన్లో లేదా నేరుగా కలిసి మాట్లాడి, సమస్యను సావధానంగా వినాలన్నారు. సున్నిత అంశాల్లో అయితే నేరుగా కలిసి మాట్లాడటం మంచిదని పేర్కొన్నారు. మండల స్థాయిలో ఎంపీడీవో, తహసీల్దార్, ఎస్‌హెచ్‌వో తదితర అధికారులు అర్జీల పరిష్కారంలో ప్రత్యక్ష భాగస్వాములు కావాలని స్పష్టం చేశారు. అప్పుడే అర్జీల పరిష్కారంలో నాణ్యతతోపాటు సంతృప్తి స్థాయి పెరుగుతుందని వివరించారు. కిందిస్థాయిలో పరిష్కారానికి వీల్లేని వాటిని సరైనవిధంగా పైస్థాయికి పంపాల్సి ఉంటుందని, అదేవిధంగా అర్జీదారునికి తెలుగులో స్పష్టమైన వివరణతో ఎండార్స్‌మెంట్ ఇవ్వాలని సూచించారు. సమర్థవంతమైన సమస్య పరిష్కారం అనేది కేవలం ప్రజలకు, ప్రభుత్వానికే కాకుండా అధికారి వ్యక్తిగత, వత్తిగత వద్ధికి ఉపయోగపడుతుందని, సమష్టి భాగస్వామ్యంతో ప్రభుత్వ లక్ష్యాలు, దార్శనికతకు అనుగుణంగా జిల్లా కలెక్టర్‌గారి సారథ్యంలో పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతంగా ముందుకుతీసుకెళ్లాలని చీఫ్ గ్రీవెన్స్ ఆఫీసర్ సూచించారు. గ్రీవెన్స్ రిడ్రెసల్ ఆడిటింగ్, ఫీడ్‌బ్యాక్ మెకానిజం తదితరాలపైనా వర్క్‌షాప్‌లో వివరించారు. సమావేశంలో గ్రామ, వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి జి.జ్యోతి, కేఆర్‌సీసీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె.పోసిబాబు, వివిధ శాఖల జిల్లాస్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశానికి మండల, డివిజన్ స్థాయి అధికారులు వర్చువల్‌గా హాజరయ్యారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీఎంవో పీజీఆర్ఎస్ సెల్ చీఫ్ గ్రీవెన్స్ ఆఫీసర్ డాక్టర్ సీహెచ్ చిన్నారావు, చిత్రంలో కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ తదితరులు

# భద్రతకు ప్రమాదకరంగా ఉన్న వైర్లను తొలగించండి

### కేబుల్, ఇంటర్నెట్ ఆపరేటర్లకు విఎంసి సిసిపి ఆదేశం

**ప్రజాశక్తి-విజయవాడ :** నగర సుందరీకరణలో భాగంగా కేబుల్ ఆపరేటర్లతో మంగళవారం విజయవాడ నగరపాలక సంస్థ చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్నకుమార్ సమావేశం నిర్వహించారు. పౌరుల భద్రతను ప్రాధాన్యంగా తీసుకుంటూ విజయవాడ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని తన ఛాంబర్‌లో సమావేశమై నగర పరిధిలో ఎక్కడైనా వేలాడుతూ ఉన్న కేబుల్, ఇంటర్నెట్ లేదా ఇతర వైర్లు, ప్రజల భద్రతకు ప్రమాదకరంగా ఉండే పరిస్థితి కనిపిస్తే, వాటిని వెంటనే తొలగించాలని ఆదేశించారు. అవసరంలేని, వాడని వైర్లను క్రమబద్ధీకరించి ఒక వారం రోజుల్లోగా తొలగించాలన్నారు. ఈ నిబంధనకు అమలు చేయకపోతే, వారం తర్వాత నగరపాలక సంస్థ అధికారులు స్వయంగా రంగంలోకి దిగి తగిన చర్యలు తీసుకుంటారన్నారు. సమావేశంలో డిప్యూటీ సిటీ ప్లానర్ చంద్రబోస్, అసిస్టెంట్ సిటీ ప్లానర్లు రాంబాబు, మోహన్ బాబు పాల్గొన్నారు.



## ఎంఎల్‌ఏ సుజనాకు స్వల్ప గాయం

**ప్రజాశక్తి - భవానీపురం :** మాజీ కేంద్ర మంత్రి, విజయవాడ పశ్చిమ శాసనసభ్యులు సుజనా చౌదరి సోమవారం లండన్‌లో స్వల్ప ప్రమాదానికి గురయ్యారు. లండన్ పర్యటనలో ఉన్న ఆయన అక్కడ ఒక సూపర్ మార్కెట్‌లో కాలు స్లిప్ అయ్యి స్వల్ప ప్రమాదానికి గురయ్యారు. ఈఘటనలో ఎమ్మెల్యే సుజనా చౌదరికి కుడి భుజం వద్ద స్వల్ప గాయమైంది. హైదరాబాద్ తిరిగి చేరుకున్న ఆయన ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మైనర్ సర్జరీ అనంతరం ఆయన విశ్రాంతి తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.

## 26 మందికి జరిమానా

**ప్రజాశక్తి - విజయవాడ :** 5వ ట్రాఫిక్ పోలీసులు మొత్తం 26 కేసుల్లో మద్యం సేవించి వాహనాలు నడిపిన వ్యక్తులను పోలీసులు మంగళవారం సంబంధిత కోర్టుల్లో ప్రవేశపెట్టారు. న్యాయమూర్తి లెనిన్ బాబు మొత్తం 26 మందిలో 8 మందికి ఒక్కొక్కరికి రూ.15 వేల చొప్పున, మిగిలిన 18 మందికి ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున జరిమానా విధించారు.

## త్వరలో అందుబాటులోకి టూరిజం ప్యాకేజీ : కలెక్టర్

**ప్రజాశక్తి-విజయవాడ :** ఎన్‌టిఆర్ జిల్లాను పర్యాటక హబ్‌గా తీర్చిదిద్దే క్రమంలో పర్యాటకులకు మధురానుభూతి మిగిల్చేలా రూపొందించిన ప్రత్యేక ప్యాకేజీలు త్వరలో అందుబాటులోకి వస్తాయని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ వెల్లడించారు. మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ లక్ష్మీశ.. టూరిజం ప్యాకేజీలపై పర్యాటక శాఖ అధికారులతో పాటు టూర్ ఆపరేటర్లు, టూర్ అండ్ ట్రావెల్ ఏజెన్సీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఒక రోజు, రెండు రోజులు, మూడు రోజులు, నాలుగు రోజుల పర్యాటక ప్యాకేజీల గురించి వివరించారు. ప్యాకేజీల కింద సందర్శనకు అందుబాటులో ఉన్న ప్రాంతాలు, ప్యాకేజీల ధరలు, పర్యాటకులకు కల్పించే వివిధ సౌకర్యాలను వివరించి, సలహాలు, సూచనలు కోరారు. భాగస్వామ్య పక్షాల సూచనలను పరిగణనలోకి తీసుకొని మార్పులు, చేర్పులు చేస్తామన్నారు. శ్రీ కనకదుర్గమ్మ వారి ఆలయం, కొండపల్లి ఖిల్లా, పవిత్ర సంగమం, భవానీ ద్వీపం, డా. బీఆర్ అంబేద్కర్ స్మృతివనం, ఉండవల్లి గుహలు, మంగళగిరి ఎకో పార్క్ ఇలా ప్రస్తుతానికి 27 ప్రదేశాలను ప్యాకేజీల్లో చేర్చామన్నారు. ఈసమావేశంలో జిల్లా పర్యాటక అధికారి ఎ.శిల్ప, అమరావతి బోటింగ్ క్లబ్ సీఈవో డా. తరుణ్ కాకాని, టూర్స్ అండ్ ట్రావెల్ ఏజెన్సీల అసోసియేషన్ల మెంబర్ బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

# 20న సమ్మెను జయప్రదం చేయండి : సిఐటియు



మాట్లాడుతున్న పోలినాయుడు

**ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్:** ఈ నెల 20వ తేదీ చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మెలో గ్రామపంచాయతీ కార్మికులందరూ పాల్గొనాలని ఏపీ గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా ప్రధాన కార్యదర్శి ముర్రాపు పోలినాయుడు అన్నారు. మంగళవారం మహాత్మ జ్యోతిబాపూలే విజ్ఞాన కేంద్రం బుట్టాయిపేట ప్రాంగణంలో పంచాయతీ కార్మికుల సమస్యలపై ఆయన మాట్లాడారు. కార్మిక వర్గాన్ని కట్టు బానిసలుగా మార్చే లేబర్ కోడ్ రద్దు చేయాలని, కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ టెండర్ పద్ధతుల్లో తీసుకున్న కార్మికులను రెగ్యులర్ చేయాలని, పంచాయతీ కార్మికులకు కనీస వేతనం 21 వేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మిక ప్రయోజనాలతో ముడిపడి ఉన్న జీవో నెంబర్ 132, 142, 680లకు సంబంధించి హైకోర్టు తీర్పు అమలు తదితర డిమాండ్ల పరిష్కారానికి చేపట్టనున్న సమ్మెలో పంచాయతీ కార్మికులు కూడా పాల్గొంటారని అందుకు సంబంధించిన సమ్మె నోటీసులు ఉన్నతాధికారులకు అందిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు కే శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు టి సాల్మన్‌రాజు, కోశాధికారి ఎం రామకృష్ణ, జిల్లా సహాయ కార్యదర్శి ఎం ప్రభు శేఖర్, జిల్లా కమిటీ సభ్యులు తాతారావు, ఎం నాగేశ్వరావు పాల్గొన్నారు

### సమ్మె పోస్టర్ విడుదల

ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యర్యంలో స్థానిక లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా డివిజనల్ కార్యాలయం వద్ద 20వ తేదీన జరగనున్న సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రధాన కార్యదర్శి జి.కిశోర్ కుమార్ మాట్లాడుతూ దేశం వ్యాప్తంగా సంఘటిత, అసంఘటిత కార్మికులు, వివిధ రంగాలలో పని చేస్తున్న ఉద్యోగులు సుమారు 20 కోట్ల మంది సమ్మెలో పాల్గొనున్నారని వివరించారు. 17 డిమాండ్లతో జరుగుతున్న ఈ సమ్మె దేశ కార్మికోద్యమంలో నూతన అధ్యాయాన్ని లిఖించి ప్రత్యేకంగా నిలవనుందన్నారు. బీమా రంగంలో వంద శాతం విదేశి ప్రతక్ష పెట్టుబడులను నిలువరించాలని, నూతన పెన్షన్ స్కీంను రద్దు చేసి ఉద్యోగులు అందరికి పాత పెన్షన్ స్కీం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు జె.సుధాకర్, జి.కిశోర్ కుమార్, డి.ాసు, ఎల్ రాజశేఖర్, వై.స్వామినాధ్, బి. మాధుర్, బండి శ్రీనివాస్, పి.నాగయ్య తదితరులు పాల్గొన్నారు.




## ఆశాలకు దుస్తులు పంపిణీ

**ప్రజాశక్తి-ఉంగుటూరు**

ఆశా వర్కర్లు క్షేత్రస్థాయిలో అంకితభావంతో పనిచేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని ఉంగుటూరు పిహెచ్‌సి హెల్త్ సూపర్వైజర్ టి. సాల్మన్ రాజు అన్నారు. ఉంగుటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని 21 మంది ఆశా వర్కర్లకు ప్రభుత్వం నుండి వచ్చిన ఏకరూప దుస్తులు (యూనిఫామ్) ను మంగళవారం ఒక్కొక్కరికి రెండు జతలు చొప్పున అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజారోగ్య పరిరక్షణలో ఆశా వర్కర్లు మరింత మెరుగైన సేవలు అందించాల్సిన అవసరం ఉందన్నారు. ఆశ వర్కర్ల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టి అమలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు ఎన్‌జె ఆశీర్వాదమ్మ, శ్రీలక్ష్మి, శశి రాజ కళ పాల్గొన్నారు.



## కెనరా బ్యాంకు ఖాతాదారుల ఇబ్బందులు




**ప్రజాశక్తి-మోపిదేవి:** ఆర్థిక అవసరాల నిమిత్తం లావాదేవీలు జరిపేందుకు బ్యాంకు వచ్చిన ఖాతాదారులు పట్టపగలే తాళాలు చూసి అవాక్కైన పరిస్థితి మంగళవారం మండల కేంద్రమైన మోపిదేవిలో చోటుచేసుకుంది. కెనరా బ్యాంక్ లోనికి ఖాతాదారులు వెళ్లడానికి అవకాశం లేకుండా మధ్యాహ్నం తాళాలు వేసి కనపడింది. దీనితో కొంతమంది ఖాతాదారులు ఇవాళ బ్యాంకు సెలవు ఏమో అనుకుని తిరిగి వెళ్లిపోయారు. దీనిపై స్థానిక కెనరా బ్యాంక్ మేనేజర్‌ని ప్రజాశక్తి వివరణ కోరగా భోజన సమయం అని తాళాలు వేసి ఉంటారని తెలిపారు. సిబ్బంది భోజనాలు చేస్తుంటే బ్యాంక్ అవసరాల నిమిత్తం వచ్చిన ఖాతాదారులు కౌంటర్లో సిబ్బంది వచ్చేవరకు వేచి ఉండడానికి కూడా ఆస్కారం లేకుండా తాళాలు వేయడంపై ఖాతాదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

## ఉపాధి కార్మికులకు బీమా పెంపు

**ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్:** జాతీయ ఉపాధి హామీ చట్టంలో భాగంగా పని ప్రదేశాలలో ఏదైనా ప్రమాదం జరిగి కార్మికులకు ప్రాణనష్టం జరిగితే అందించే బీమా పరిహారం 50 వేల రూపాయల నుంచి 2 లక్షల వరకు పెంచినట్లు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు శీలం నారాయణరావు తెలిపారు. మంగళవారం మహాత్మ జ్యోతిబాపూలే విజ్ఞాన కేంద్రం బుట్టాయిపేట ప్రాంగణంలో ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ కార్మిక చట్టం వచ్చిన దగ్గర నుంచి 20 సంవత్సరాలుగా వ్యవసాయ కార్మిక సంఘం చేపట్టిన పోరాటాల ఫలితంగా వ్యవసాయ గ్రామీణ ఉపాధి హామీ కార్మికులకు భీమా పరిహారం పెంపు ప్రయోజనం చేకూరిందన్నారు. ఉపాధి హామీ కార్మికులకు ఇన్సూరెన్స్ మొత్తం పెంచాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి అనేక సందర్భాల్లో ఆందోళనలు రూపంలో తెలియజేయడం జరిగిందన్నారు. ప్రతి ఒక్క ఉపాధి శ్రామికులకు ఈ పథకం వర్తింప చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి అజ్మీర. వెంకటేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షులు మల్లంపల్లి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# వేసవి విజ్ఞాన శిబిరాలు

**ప్రజాశక్తి-గుడ్లవల్లేరు:** మండల కేంద్రమైన గుడ్లవల్లేరు ద్వితీయ శ్రేణి శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. విద్యార్థులతో కథలు చదివించారు. అనంతరం లెమన్ స్పూన్ గేమ్స్ నిర్వహించినట్లు గ్రంధాలయ అధికారులు టి.వాణి తెలిపారు. **మోపిదేవి:** వేసవి సెలవుల్లో విద్యార్థులు గ్రంథాలయాలను ఆశ్రయించడం మంచిదని రిటైర్డ్ ఉపాధ్యాయులు కంఠంనేని కుటుంబరావు పేర్కొన్నారు.



గుడ్లవల్లేరులో...

గ్రంధాలయాల్లో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన తరగతులలో భాగంగా పిల్లలు గ్రంథలయాల్లో అందుబాటులో ఉన్నటువంటి పుస్తకాలు ఆట వస్తువులతో కాలక్షేపం చేయడం వల్ల మానసిక వికాసానికి దోహదపడుతుందన్నారు. స్థానిక గ్రంధాలయ శాఖ అధికారి కైతేపల్లి సుధీర్‌కుమార్ ఈ వేసవి సీజన్లో విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన, అనర్గళంగా మాట్లాడగలిగే నైపుణ్యాలను బోధిస్తున్నారు.

**గన్నవరం:** గన్నవరం శాఖా గ్రంతాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా మంగళవారం విద్యార్థిని విద్యార్థులకు లెక్కల్లో శిక్షణ ఇచ్చారు. రిటైర్డ్ మాస్టర్ ధర్మారావు లెక్కలు చేయడం ఎలా, దానిలో సులభమైన మార్గాలను పిల్లలకి అర్థమయ్యేలా వివరించారు. లెక్కలు చేయడంలో మెళకువలను చెప్పారు. కథలు చదివించడం ,కథలు చెప్పించడం, క్యారమ్స్ నిర్వహించారు. గ్రంథాలయ కమిటీ సభ్యులు చిమట రామారావు మాట్లాడుతూ గ్రంధాలయాలు ఎంతో దోహదపడతాయని ప్రతి విద్యార్థి గ్రంధాలయానికి వచ్చి,



కంకిపాడులో...

మేధస్సును పెంచుకోవడానికి ఎంత ఉపయోగపడతాయని అన్నారు.

**ఉంగుటూరు:** ఉంగుటూరు గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా మంగళవారం విద్యార్థిని విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. కథలు చెప్పడం, క్యారమ్స్ నిర్వహించడం లాంటి కార్యక్రమాలు ఈ విజ్ఞాన శిబిరంలో భాగంగా కొనసాగుతున్నాయని దీనిని విద్యార్థులంతా వినియోగించుకోవాలని గ్రంథాలయ శాఖ అధికారి కోరారు. **కంకిపాడు:** కంకిపాడు శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపు ప్రోగ్రాంలో మంగళవారం విద్యార్థులతో పుస్తక పఠనం, పాటలు పాడించడం, ఆటల పోటీలు నిర్వహించినట్లు గ్రంథాలయ నిర్వాహకులు సిహెచ్ రామకృష్ణ తెలిపారు.

## పిహెచ్‌సి సిబ్బంది నిరసన

**ప్రజాశక్తి-పమిడిముక్కల:** ఆరోగ్య సిబ్బంది, నర్సులు, సూపర్వైజర్లపై ఎమ్మెల్యే చేసిన అనుచిత వ్యాఖ్యలు సమంజసం కాదని వీరంకిలాకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పిహెచ్‌ఎన్ ఝాన్సీ రాణి అన్నారు. మంగళవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో భోజన విరామ సమయంలో నర్సులు, సిబ్బంది నిరసన తెలిపారు. నల్ల బ్యాడ్జీలు ధరించారు. సిబ్బందిపై అనుచిత వ్యాఖ్యలు చేయటం ఎమ్మెల్యేకు తగదన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ కృష్ణమోహన్, ఎఎన్ఎంలు నాంచారమ్మ, లక్ష్మి, కృప, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.




## ఆలయ నిర్మాణానికి విరాళం

**ప్రజాశక్తి-గన్నవరం:** గన్నవరం మండలం కేసరపల్లి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి గ్రామస్తులు ఉండ్రకొండ ఏసుబాబు రూ. 2,01116 విరాళం మంగళవారం ఆలయ కమిటీకి అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యులు మరీదు రాంబాబు, రత్తయ్య పాల్గొన్నారు.

## యువతి ఆత్మహత్య


**ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్:** మచిలీపట్నం మండలం ఎన్ గొల్లపాలెం గ్రామానికి చెందిన చెందిన కుక్కల సురేష్ కుమార్తె శ్రీవిద్య (20) ఇష్టం లేని వివాహ సంబంధం చేస్తున్నారన్న కోపంతో సోమవారం ఆత్మహత్య చేసుకుంది. ఇంటి నుండి స్కూటీపై వచ్చి చిన్నాపురం పంచాయితి పరిధిలోని వెంకటాపురం (పాటిమీద) కాలువలో దూకి ఆత్మహత్య చేసుకుంది. స్థానికుల సమాచారంతో అధికారులు, ఫైర్ సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టడంతో మంగళవారం శ్రీవిద్య మృతదేహం లభ్యమైంది. తాలూకా పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మచిలీపట్నం సర్వజన ఆసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## నేడు కొల్లి చక్రపాణి వర్థంతి

**ప్రజాశక్తి-మోపిదేవి:** మోపిదేవి మండల పరిషత్ అధ్యక్షులుగా విశేష సేవలు అందించిన కొల్లి చక్రపాణి 9వ వర్ధంతి బుధవారం నిర్వహించనున్టన్లు కుమారుడు మురళీకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమానికి అవనిగడ్డ శాసనసభ్యులు మండలి బుద్ధ ప్రసాద్, గ్రామీణ యువజన వికాస సమితి అధ్యక్షులు మండలి వెంకట్రాం మోపిదేవి జడ్పిటిసి సభ్యులు మెడబలిమి మల్లికార్జునరావు తదితరులు హాజరవుతారని తెలిపారు.

## ఇన్సూరెన్స్ చెక్కు అందజేత

**ప్రజాశక్తి-మొవ్వ :** టిడిపి కార్యకర్తలకు అన్ని వేళలా అండగా ఉంటుందని పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా అన్నారు. మొవ్వ మండలం నిడమోలు గ్రామంలో ఇటీవల మరణించిన పార్టీ కార్యకర్త కోట పోతురాజు కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే కుమార్ రాజా మంగళవారం ఐదు లక్షల ఇన్సూరెన్స్ చెక్కును అందజేశారు. మంత్రి నారా లోకేష్ ముందుచూపుతో సభ్యత్వం ఉన్న ప్రతి కార్యకర్తకు ఇన్సూరెన్స్ సదుపాయం కల్పించారన్నారు.



## తాగునీటి సౌకర్యం కల్పించాలని వినతి

**ప్రజాశక్తి-నందివాడ:** మండలంలోని కుదరవల్లి గ్రామంలో గత ఆరు సంవత్సరాల నుండి మంచినీటి కాలువ ద్వారా మంచినీరు నింపుకునే అవకాశం లేదని గ్రామంలో ఉపాధి హామీ పనులు 2024-25 పని జరగడంలేదని కలెక్టర్‌కు కుదరవల్లి గ్రామ టిడిపి నాయకులు, మాజీ సర్పంచ్ మసిముక్కు వేణుగోపాలరావు వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వేణు మాట్లాడుతూ, రామాపురం గ్రామంలోని భూమి కోడు అండర్ తూములు పగిలి దాని ద్వారా వచ్చే మురుగునీరు పంటకాలవ లోకి చేరి నీటి కలుషితం అవుతుందన్నారు. తాగునీరు గ్రామంలో మంచినీటి చెరువుకు నింపుకునే అవకాశంలేక బుడమేరు నుండి వచ్చే మురుగు నీటిని చెరువుకి నింపుకోవాల్సి వస్తుందని, పంట కాలువకు వచ్చే మురుగునీటి తూమును పూడ్చి మంచినీటిని సాగునీటి కాలువ ద్వారా చెరువుకి నింపుకునే ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని వేణు కోరారు.



# విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా వైసిపి ఆందోళనలు

**ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ :** పెంచిన విద్యుత్ ఛార్జీలను తక్షణమే తగ్గించాలని వైసిపి జిల్లా అధ్యక్షులు దేవినేని అవినాష్ అన్నారు. నగరంలోని విద్యుత్ నిలయం సిఎండి కార్యాలయంలో విద్యుత్ ఛార్జీలు పెంపునకు నిరసనగా ధర్నా మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలో పెంచిన కరెంట్ ఛార్జీలకు వ్యతిరేకంగా నిరసన చేపట్టి అధికారులకు వినతి పత్రాలు అందచేశామన్నారు. ఛార్జీలు పెంచేది లేదని కూటమి ప్రభుత్వం రాకముందు హామీ ఇచ్చి మాట తప్పిందన్నారు. సంక్షేమం,అభివృద్ధి లేకపోగా ఛార్జీల మోత మోగిస్తున్నారన్నారు. ఇప్పటికైనా పెంచిన ఛార్జీలను తక్షణమే తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ దుర్గ, పలువురు నాయకులు పాల్గొన్నారు. **విజయవాడ :** వైసీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు డిప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజారెడ్డి, వైసీపీ కార్పొరేటర్లతో కలిసి పిడబ్ల్యుడి గ్రౌండ్ వద్దనున్న విద్యుత్ శాఖ కార్యాలయంలో ఎస్ఈ సాంబశివరావుకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరిగిన విద్యుత్ భారాలను వెంటనే తగ్గించకుంటే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఆనాటి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్మోహన్ రెడ్డి రైతాంగానికి, గృహ వినియోగదారులకు, పరిశ్రమలకు కరెంట్ కష్టాలు తగ్గించాలని ముందుచూపుతో అతి తక్కువ ధరకు విద్యుత్ ఒప్పందాలు చేసుకుంటే.. కూటమి నేతలు నానా యాగీ చేశారని మల్లాది విష్ణు మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో వైసీపీ కార్పొరేటర్లు ఇసరపు దేవీ, యరగొర్ల తిరుపతమ్మ, వైసీపీ జిల్లా కమిటీ సభ్యులు, పార్టీ నియోజకవర్గ వివిధ విభాగాల అధ్యక్షులు, ఇతర ముఖ్య నాయకులు, పార్టీ శ్రేణులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. **వన్‌టౌన్ :** పేదలకు భారంగా మారిన పెంచిన విద్యుత్ ఛార్జీలకు వ్యతిరేకంగా, ప్రజలపై మరింతగా భారాన్ని మోపుతూ అధిక ధరలకు యాక్సిస్‌తో చేసుకున్న విద్యుత్తు ఒప్పందాన్ని రద్దు చేసుకోవాలని, వైఎస్ జగన్ పిలుపు మేరకు మాజీ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం కెఎల్ రావు నగర్‌లోని విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మేయర్ రాయన భాగ్యలక్ష్మి, ఎమ్మెల్సీ రూహుల్లా, వైసిపి ప్రధాన కార్యదర్శి షేక్ ఆసిఫ్, జిల్లా వక్ఫ్ బోర్డు మాజీ ఛైర్మన్ షేక్ గౌస్ మొహిద్దీన్, దుర్గగుడి మాజీ ఛైర్మెన్ కర్నాటి రాంబాబు, స్థానిక కార్పొరేటర్ గోదారి గంగ తో పాటు పలువురు నాయకులు, కార్పొరేటర్లు, శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. **జగ్గయ్యపేట :** జగ్గయ్యపేట నియోజకవర్గ వైఎస్ఆర్ సిపి ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలో డిపో సెంటర్‌లో గల ఎలక్ట్రికల్ ఎ.డి కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా తన్నీరు నాగేశ్వరరావు మాట్లాడుతూ అబద్ధపు హామీలతో అధికారం చేపట్టి కరెంటు ఛార్జీల పెంపుతో ప్రజలను మోసం చేస్తున్న ఈ కూటమి ప్రభుత్వం తక్షణమే గృహ వినియోగదారులపై మోపిన కరెంటు చార్జీల బాదుడు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా చార్జీల పెంపుని రద్దు చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్లు ఉచిత విద్యుత్ కొనసాగించాలని కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కరెంటు చార్జీల పెంపును ఉపసంహరించుకునే వరకు వైఎస్ఆర్సిపి పోరాటం ఆగదని తెలిపారు. అనంతరం విద్యుత్ ఎడి జె.శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షులు వట్టెం మనోహర్, మున్సిపల్ వైస్ చైర్మన్ హాఫిజ్ జున్నీసా - ఫిరోజ్ ఖాన్, మండలం పార్టీ అధ్యక్షులు బూడిద నరసింహారావు, రాష్ట్ర ప్రచార విభాగ కార్యదర్శి చౌడవరపు జగదీష్, రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి కన్నమాల శామ్యూల్, రాష్ట్ర బిసి సెల్ ప్రధాన కార్యదర్శి బత్తుల రామారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి చల్లా వైకుంఠరావు, కార్యదర్శులు వేముల మల్లేశ్వరరావు, మాతంగి నాగబాబు వైఎస్ఆర్సిపి నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, వివిధ అనుబంధ సంఘ నేతలు, తదితరులు పాల్గొన్నారు. **తిరువూరు :** మండలంలోని లక్ష్మీపురం విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద వైసిపి నాయకులు ఆందోళన చేశారు. ప్రజలపై రూ.15 వేల 400 కోట్ల చార్జీలు పెంచి భారం మోపిందని వైసిపి తిరువూరు నియోజకవర్గ ఇన్ ఛార్జ్ నల్లగట్ల స్వామిదాస్ ఆరోపించారు. విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని డిమాండ్ చేశారు. అనంతరం విద్యుత్ శాఖ ఏఈకి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్ర మంలో ఉమ్మడి జిల్లా పరిషత్ మాజీ చైర్పర్సన్ ఎన్. సుధారాణి, వైసిపి మండల అధ్యక్షులు తాళ్లూరి నవీన్, నాయకులు యర్రమల రామ చంద్రారెడ్డి, కాలసాని నాగేశ్వరరావు, మామిడి కుటుంబరావు, జి.నాగేశ్వరరావు, బొర్రా మోహనరావు, వెలుగోటి ఆదినారాయణ, నరెడ్ల వీరా రెడ్డి పాల్గొన్నారు.



విజయవాడలో వినతిపత్రం అందజేస్తున్న మల్లాది విష్ణు



వినతిపత్రం అందజేస్తున్న నల్లగట్ల స్వామిదాస్



వన్‌టౌన్‌లో ఆందోళన చేస్తున్న వెలంపల్లి, మేయర్ భాగ్యలక్ష్మి, గౌతమ్ రెడ్డి, డిప్యూటీ మేయర్, తదితరులు

## డొక్కా సీతమ్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదానం

**ప్రజాశక్తి - విజయవాడ :** సెంట్రల్ నియోజకవర్గం 58వ డివిజన్ పైపుల్ రోడ్డు కూడలి వద్ద డొక్కా సీతమ్మ చారిటబుల్ ట్రస్ట్ (అవుటుపల్లి విజయ్ కుమారి) ఆధ్వర్యంలో ప్రతి నెల నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ప్రభుత్వ విప్, సెంట్రల్ నియోజకవర్గ శాసనసభ్యులు బొండా ఉమామహేశ్వరరావు పాల్గొని పాదచారులకు నిరుపేదలకు భోజనాలు ఏర్పాటు చేసి స్వయంగా వడ్డించారు. ఈ సందర్భంగా బొండా ఉమా మాట్లాడుతూ డొక్కా సీతమ్మ చేసిన సేవలను స్మరించుకుంటూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం – విద్యార్థులకు ఏర్పాటుచేసి ప్రతిరోజు నాణ్యమైన భోజనం పోషకాహారం అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంసాని విజయలక్ష్మి, గుబ్బల జ్యోతిశ్వరి, అవుటుపల్లి ఉమామహేశ్వరి పాల్గొన్నారు.



చదరంగంలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

## గ్రంథాలయాల్లో శిక్షణా

**ప్రజాశక్తి - కంచికచర్ల :** కంచికచర్ల శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతుల్లో భాగంగా మంగళవారం విద్యార్థులకు పుస్తక పఠనంపై శిక్షణ ఇచ్చారు. అనంతరం యు అక్షరాన్ని ఉపయోగించి ఫ్లవర్ గీయటం నేర్చుకున్నారు. డ్రాయింగ్ మాస్టారు నీలం సర్వేశ్వరరావు డ్రాయింగ్‌లో మెళకువలు నేర్పించారు. క్రాఫ్ట్ మాస్టర్ ఎం, కనకారావు మెరిసే చమికీలతో పేరు రాయడం నేర్పారు. అనంతరం విద్యార్థులకు చదరంగం శిక్షణ ఇచ్చారు. గ్రంథాలయాధికారి అల్లూరు రామచంద్రుడు పర్యవేక్షించారు.



బోధకాలు బాధితులకు కిట్లు అందజేస్తున్న సిబ్బంది

## దోమల నిర్మూలనా చర్యలు చేపట్టాలి

**ప్రజాశక్తి - తిరువూరు :** దోమల నిర్మూలనతో భోదకాలు వ్యాప్తిని అరికట్టవచ్చుని వైద్యాధికారి డాక్టర్ రేష్మా బేగం అన్నారు. తిరువూరు అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో మంగళవారం బోదకాలు నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంటి పరిసరాలలో రోజుల తరబడి నీరు నిల్వలేకుండా చూడాలన్నారు. ఇంట్లోకి దోమలు రాకుండా దోమతెరలు వాడాలని, ద్వార బందాలకు, కిటికీలకు మెష్‌లు బిగించుకోవాలని తెలిపారు. భోదకాలు వ్యాధిగ్రస్తులకు ఎంఎండిపి కిట్లు పంపిణీ చేశారు. హెల్త్ సూపర్వైజర్ కె.రవి, సబ్ యూనిట్ అధికారి బాబావలి, హెల్త్ విజిటర్ ఎస్.కె. ఆషా బి, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

## రెడ్డిగూడెంలో వర్షం

**ప్రజాశక్తి - రెడ్డిగూడెం :** మండల పరిధిలోని గ్రామాల్లో మంగళవారం రాత్రి 7 గంటల సమయంలో ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. గాలి దుమ్ముతో కూడిన వర్షం కావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కొన్ని చోట్ల దాళ్వా ధాన్యం ఇంకా కళ్ళాల్లో ఉండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే రెండు మూడు సార్లు కురిసిన వర్షాలకు ధాన్యం తడిసి రంగు మారిన పరిస్థితుల్లో మంగళవారం పడిన వర్షం దెబ్బకు రైతులు బెంబేలెత్తుతున్నారు.

## 16వ డివిజన్‌లో ఎంఎల్ఎ గద్దె పర్యటన

**ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ :** కృష్ణా రిటైనింగ్ వాల్ పక్కన నివాసం ఉంటున్న ఇళ్ళలోని వారందరికి పట్టాలు ఇచ్చేలా చూస్తానని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామమోహన్ అన్నారు. రిటైనింగ్ వాల్ పక్కన రోడ్లు, సంప్, డ్రైనేజీ నిర్మాణాలు పూర్తయిన తర్వాత ఇక్కడి స్థలం గురించి కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా యజమానులందరికి ఇళ్ళ పట్టాలు అందచేస్తామని చెప్పారు. మంగళవారం ఉదయం తూర్పు నియోజకవర్గ పరిధిలోని 16వ డివిజన్ కళానగర్, రామలింగేశ్వర నగర్ గాయత్రీ రోడ్డు, కమ్యూనిటీ హాల్ ఏరియాల్లో ఎమ్మెల్యే గద్దె రామమోహన్ పర్యటించారు. స్థానికంగా ఉన్న సమస్యలను ఆయన స్వయంగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం డివిజన్‌లోని నిరుపేద కార్యకర్త అయిన హేమవరపు రమణకు రూ.25 వేలు విలువ చేసే బడ్డీకొట్టును, వాసనా వనజకు రూ.25 విలువ చేసే టిఫిన్ బండిని ఎమ్మెల్యే గద్దె రామమోహన్ తన సొంత నిధులతో కొనుగోలు చేసి అందచేశారు. మొత్తం రూ.50 వేలు విలువ చేసే ఆర్థిక సహాయాలను ఎమ్మెల్యే గద్దె రామమోహన్ మంగళవారం అందచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గద్దె రామమోహన్ మాట్లాడుతూ కష్ణలంక కరకట్ట దగ్గర ఎన్నో సంవత్సరాలుగా పేదలు నివాసం ఉంటున్నారన్నారు. ఇళ్ళు కొనుగోలు చేసే శక్తి లేక కరకట్టపై నివాసాలు ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నారని చెప్పారు. భూపేష్‌గుప్తా నగర్,శ్రీరామ్ కట్‌పీసెస్‌తో పాటు మరో ప్రాంతంలో జనరేటర్‌తో కూడిన పంపింగ్ హౌస్‌లు నిర్మాణం చేయాలని నిర్ణయించారన్నారు. ఈ స్థలం కేంద్ర ప్రభుత్వం ఆధీనంలో ఉండటంతో వారి నుంచి అన్ని అనుమతులు వచ్చిన వెంటనే రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఇళ్ళ పట్టాలు మంజూరు చేస్తామని, సాధ్యమైనంత త్వరగా ఈ పనులు పూర్తి చేస్తామని ఎమ్మెల్యే గద్దె రామమోహన్ చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి డివిజన్ అధ్యక్షుడు రత్నం రమేష్ చందు శివరామకృష్ణ, ఉమ్మడిశెట్టి బహుదూర్, సింగంశెట్టి రమేష్, పువ్వాడ శ్రీను, బాబూరావు, కార్పొరేషన్ ఈఈ సామ్రాజ్యం, ఏఈ జస్వంత్ పాల్గొన్నారు.



స్థానికులతో మాట్లాడుతున్న ఎంఎల్ఎ గద్దె రామ్మోహన్‌రావు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

## జెవివి ఆధ్వర్యంలో చిత్ర లేఖన పోటీలు

**ప్రజాశక్తి - తిరువూరు :** రోజురోజుకు పెరుగుతున్న పర్యావరణ కాలుష్యం గురించి విద్యార్థులలో అవగాహన పెంచడానికి జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో విద్యార్థు లకు మంగళవారం చిత్ర లేఖన పోటీలు జరిగాయి. తిరువూరు సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జెవివి పర్యవేక్షణలో జరుగుతున్న ఉచిత వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా చిత్ర లేఖన పోటీలు నిర్వహించినట్లు జెవివి జిల్లా నాయకులు ఎం.హరికృష్ణ కె.పాపారావు తెలిపారు. మొత్తం ఈ పోటీల్లో పాల్గొన్న 75 మంది విద్యార్థుల్లో విజేతలుగా నిలిచిన జోషిక, జశ్విత, తన్విలకు జ్ఞాన గౌతమ్ ట్యూషన్ నిర్వాహకులు డి.శ్రీనివాసరావు ప్రోత్సాహక బహుమహుతులందించారు. ఈ కార్యక్రమంలో జెవివి నాయకులు ఎం.సుధాకర్, ఎస్.జగన్మోహన్‌రావు, పి.వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

## దేవాదాయ మంత్రికి ఆహ్వానం

**ప్రజాశక్తి - జగ్గయ్యపేట :** మండలంలోని వేదాద్రి గ్రామంలో గల శ్రీ యోగానంద లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానంలో ఈ నెల 7 నుండి 14 వరకు నిర్వహించనున్న వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆంధ్రప్రదేశ్ దేవదాయ ధర్మదాయ శాఖ మంత్రి ఆనం రాంనారాయణరెడ్డిని దేవస్థాన కార్యనిర్వహణాధికారి కానూరి సురేష్ బాబు దేవస్థాన వంశపారంపర్య ధర్మకర్త డాక్టర్ వెలగపూడి లక్ష్మణ ఇందిరాదత్తు తరుపున పి.రామ్ ప్రసాద్ వారి స్వగృహంలో మర్యాద పూర్వకంగా కలిసి శ్రీ స్వామి బ్రహ్మోత్సవాల కళ్యాణ ఆహ్వాన పత్రికను అందజేశారు.

## మినరల్ వాటర్ ప్లాంట్ల పరిశీలన

**ప్రజాశక్తి - రెడ్డిగూడెం :** మండలంలోని మద్దులపర్వలో గల మినరల్ వాటర్ ప్లాంట్, 2 ఓవర్ హెడ్ మంచినీటి ట్యాంక్‌లను, నెం.5 చౌకధరల దుకాణాన్ని రెడ్డిగూడెం తహశీల్దారు జె.సుశీలా దేవి ఆకస్మిక తనిఖీ చేశారు. సదరు కార్యక్రమంలో మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గంధం పుల్లయ్య, పంచాయితీ సెక్రటరీ ఎం.వెంకటేశ్వరరావు, విఆర్ఓ నీలయ్య పాల్గొన్నారు.

# ప్రజలకు నీటి సమస్య రానివ్వం : కొల్లు

**ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా):** నగర ప్రజలకు నీటి సమస్య తలెత్తకుండా చూడటమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర స్పష్టం చేశారు. మంగళవారం ఆయన నగర పరిధిలోని మాచవరం రెండవ డివిజన్లో దాదాపు రూ.2.68 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన 500 కిలో లీటర్ల సామర్థ్యం గల ఎలివేటెడ్ లెవెల్ సర్వీస్ రిజర్వాయరును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ ఈ ప్రాంతంలో నూతనంగా నిర్మించిన ఈ ఓవర్ హెడ్ ట్యాంక్ ద్వారా దాదాపు ఐదు లక్షల లీటర్లను నిల్వ చేసి నగర ప్రజలకు అందించడం జరుగుతుందన్నారు. ఈ రిజర్వాయరును నిర్మించడానికి 2014లో అమత్ పథకం కింద కోట్లాది రూపాయల నిధులను మంజూరు చేయించి పనులు చేపట్టినప్పటికీ తర్వాత వచ్చిన ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా కనెక్షన్లు ఇవ్వకపోవడంతో మాచవరంతో పాటు గిలకలదిండిలోని రెండు ట్యాంకులు నిరుపయోగంగా ఉండిపోయాయన్నారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మిగిలిన పనులను పూర్తి చేసి నగర ప్రజలకు పూర్తిస్థాయిలో


రిజర్వాయర్‌ను ప్రారంభిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర

అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. మచిలీపట్నం నియోజకవర్గంలో 14 ప్రాంతాలలో రిజర్వాయర్లను ఏర్పాటు చేసుకున్నామని, భవిష్యత్తులో అవసరం మేరకు మరిన్ని రిజర్వాయర్ లు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.గతంలో కూడా 200 ఎకరాలలో తరకటూరు సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ ను అప్పటి టిడిపి ప్రభుత్వ దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు హయాంలోనే ఏర్పాటు చేశామని మంత్రి గుర్తు చేశారు. తర్వాత 2014-19 టిడిపి ప్రభుత్వ హయాంలో తరకటూరు పైపులైన్లకు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టి నీటి వృధాను అరికట్టామని అన్నారు. అదేవిధంగా నీటిని శుద్ధి చేయడానికి రూ.16 కోట్ల వ్యయంతో నగరంలో ప్లాంట్ ను ఏర్పాటు చేశామన్నారు. వేసవి దష్ట్యా ఎక్కడా కూడా నీటి సమస్య తలెత్తకూడదనే ఉద్దేశంతో ఇటీవల దాదాపు వెయ్యి హార్స్ పవర్ సామర్థ్యం గల మోటార్లను పెట్టి సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ ను నింపామని, దీనివల్ల బందరు పట్టణంతోపాటు బందరు మండలం, పెడనకు రాబోయే రెండు నెలలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా సరిపోయినంత నీటి లభ్యత ఉందని మంత్రి తెలిపారు. జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ చైర్మన్ బండి రామకృష్ణ మాట్లాడుతూ వేసవి దష్ట్యా మంత్రి ముందుచూపుతో రాబోయే 70 రోజులకు బందరు నియోజకవర్గ ప్రజలకు నీటి సమస్య తలెత్తకుండా సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులను నింపారని అన్నారు. ఈ కార్యక్రమంలో మచిలీపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కుంచె నాని, మాజీ మున్సిపల్ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్, నగర మున్సిపల్ కమిషనర్ బాపిరాజు, కూటమి నాయకులు మాదివాడ రాము తదితర నాయకులు పాల్గొన్నారు.



## వాకర్లకు మజ్జిగ పంపిణీ

**ప్రజాశక్తి-గన్నవరం**

గన్నవరం బాలుర క్రీడా మైదానంలో వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం గూడపాటి రాంబాబు సహకారంతో వంద మందికి మజ్జిగ పంపిణీ చేశారు. సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు కిషోర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో టిఎస్ఆర్‌కే ప్రసాద్, తిరివీది వెంకయ్య, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

## 10న డయల్ యువర్ ఎస్‌పి

**ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)**

ప్రతి సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికకు హాజరు కాలేని ప్రజల సౌకర్యార్థం జిల్లా ఎస్పీ ఈ నెల 10న డయల్ యువర్ ఎస్‌పి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు తెలిపారు. శనివారం ఉదయం 11 గంటల నుండి 12 గంటల వరకు ఈ డయల్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని కాబట్టి జిల్లాలో ప్రజలు వారు ఎదుర్కొంటున్న సమస్యలను గురించి 9440796400 నెంబర్ కు తెలియజేసి పరిష్కరించుకోవచ్చని తెలిపారు.

# మినుము కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి

**ప్రజాశక్తి-బంటుమిల్లి:** బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల్లో మినుము కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని రైతు సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు ఎంఆర్‌ఒలకు వినతిపత్రాలు అందజేశారు. డ్రైనేజీ పనులు వెంటనే ప్రారంభించాలని, ఆక్వా రైతులను ఆదుకోవాలని, నాణ్యమైన వరి విత్తనాలు 75 శాతం సబ్సిడీపై రైతులకు సరఫరా చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి గౌరీశెట్టి నాగేశ్వరావు, లంకదాసుల అజయ్ గోష్, పుప్పాల నరసింహారావు, పోకల వీరాంజనేయులు, వెంకటేశ్వరరావు, గౌరిశెట్టి రమేష్, సుంకర వెంకన్న, గౌరిశెట్టి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.


అధికారికి వినతిపత్రం ఇస్తున్న రైతులు, రైతు సంఘం నాయకులు

# పరిశ్రమల స్థాపనకు కృషి : వర్ల


అయినంపూడిలో ప్రభుత్వ భూమిని పరిశీలిస్తున్న పామర్రు ఎమ్మెల్యే వర్ల

**ప్రజాశక్తి-పామర్రు:** మండల పరిధి అయినంపూడిలోని ప్రభుత్వ భూమిని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పామర్రు ప్రాంతంలో చిన్న తరహా పరిశ్రమలు ఏర్పాటుకు తాను కషి చేస్తున్నానన్నారు. అయినంపూడిలో వివిధ సర్వే నంబర్ల కింద 10.50 ఎకరాల భూమి మిగుల భూముగా ప్రభుత్వం చే గుర్తింపబడిందని ప్రభుత్వం ఈ భూమిని స్వాధీనం చేసుకొని ఎం.ఎస్.ఎం.ఈ (సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు) కోసం ఈ భూమిని కేటాయించిందన్నారు. ఏపీఐఐసీ ఆధ్వర్యంలో రూ.11.30 కోట్లతో పారిశ్రామిక పార్కును ఈ ప్రాంతంలో ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు.ఈనెల ఒకటో తారీఖున ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేత వర్చువల్ విధానంలో శంకుస్థాపన కార్యక్రమం జరిగిందన్నారు. ఇప్పటికే పామర్రు నియోజకవర్గంలో నెమ్మలూరులో బెల్ కంపెనీ ఉందని పమిడిముక్కల మండలంలో చిన్న తరహా పరిశ్రమ అయిన పామాయిల్ నర్సరీ ఏర్పాటు చేశామని ప్రభుత్వం ఇచ్చిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పామర్రు ప్రాంత విద్యావంతులకు ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు ఆయన తెలిపారు.

# విలేజ్ క్లినిక్ ఆఫీసర్ల ర్యాలీ

**ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్:** జిల్లా వ్యాప్తంగా పనిచేస్తున్న ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య కేంద్రం విలేజ్ క్లినిక్ ఆఫీసర్లు తమ హక్కుల కోసం గత తొమ్మిది రోజులుగా సమ్మె చేస్తున్నారు. మంగళవారం మచిలీపట్నం కోనేరు సెంటర్ నుండి రాజా గారి సెంటర్, రేవతి సెంటర్ ,బస్టాండ్ జిల్లా కోర్టు సెంటర్ ,లక్ష్మీ టాకీస్ సెంటర్ మీదుగా ధర్నా చౌక్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో 200 మంది విలేజ్ క్లినిక్ ఆఫీసర్లు పాల్గొన్నారు. రేవతి సెంటర్, లక్ష్మీ టాకీస్ సెంటర్లో మానవహారం గా ఏర్పడి తమ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విలేజ్ క్లినిక్ ఆఫీసర్ లు మాట్లాడుతూ గత నెల 16వ తేదీ నుండి రాష్ట్రవ్యాప్తంగా ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రం విలేజ్ క్లినికల్ ఆఫీసర్లు సమ్మె చేస్తున్నామని అన్నారు. తమ డిమాండ్లు నెరవేరే వరకు సమ్మెను కొనసాగిస్తామని అన్నారు. ఆరు సంవత్సరాలు విధులు నిర్వహించిన ప్రతి సిహెచ్‌ఓ ను ప్రతి ఒక్కరినీ రెగ్యులర్ చేయాలని అన్నారు. ఈపీఎఫ్ లో కట్ చేసి ఇన్సెంటివ్ కాల వ్యవధిలో ఇవ్వాలని కోరారు. రాష్ట్ర వైద్య శాఖ మంత్రి సత్య కుమార్ విలేజ్ క్లినికల్ ఆఫీసర్ ల(సిహెచ్‌ఓ) పై చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తో




చర్చించడానికి విలేజ్ క్లినిక్ ఆఫీసర్ల రాష్ట్ర కమిటీ సిద్ధంగా ఉందన్నారు. ర్యాలీ అనంతరం జిల్లా కలెక్టర్ డీకే బాలాజీకు వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సందీప్ కుమార్, నాగబాబు ,ఝాన్సీ రాణి, ఉదయ్ కిరణ్, శిన్ని ప్రియా, మణికంఠ, స్టీవెన్సన్ తదితరులు పాల్గొన్నారు.

## బండి రామకృష్ణకు సన్మానం

**ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్:** కృష్ణాజిల్లా సహకార మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమితులైన మచిలీపట్నం జనసేన పార్టీ ఇంచార్జ్ బండి రామకృష్ణను కోడూరు మండల జనసేన పార్టీ నేతలు మర్యాద పూర్వకంగా కలుసుకుని ఘనంగా సత్కరించారు. మచిలీపట్నంలోని జనసేన పార్టీ కార్యాలయంలో మంగళవారం జనసేన జిల్లా పార్టీ కార్యదర్శి కొండవీటి సునీత శుభాకాంక్షలు తెలియజేసి శాలువాతో సత్కరించి మెమొంటోను బహుకరించారు. ఈ కార్యక్రమంలో కోడూరు మండల జనసేన పార్టీ అధ్యక్షులు మర్రి గంగయ్య, పట్టణ అధ్యక్షులు కోట రాంబాబు, సిద్దినేని అశోక్‌నాయుడు, కోడూరు పిఏసిఎస్ మాజీ అధ్యక్షులు పూతబోయన కరుణ్ కుమార్, లయన్స్ క్లబ్ అధ్యక్షులు పూతబోయిన సీతారత్నసాయి బాబు తదితరులు పాల్గొన్నారు.



## 'మన మిత్ర'తో పౌర సేవలు వేగవంతం

**ప్రజాశక్తి-ఉయ్యూరు:** కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన మనమిత్ర ద్వారా వివిధ ధవపత్రాలకు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగకుండా పౌర సేవలు సత్వరం అందుకోవచ్చని ఎంపీడీఓ జీవస్పీ శేషగిరిరావు అన్నారు. చినఓగిరాల గ్రామ సచివాలయం వద్ద మనమిత్ర బోర్డు ను మంగళవారం ప్రదర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండల పరిధిలోని 11 గ్రామ సచివాలయాలలో ప్రజలకు కన్పించే విధంగా మనమిత్ర డిస్ప్లే ఏర్పాటు చేశామన్నారు. టీడీపీ మండలపార్టీ అధ్యక్షుడు యెనిగళ్ల కుటుంబరావు మాట్లాడుతూ, కుల, ఆదాయ ధవీకరణ పత్రాలు, ఇతర సేవలకోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయనవసరం లేకుండా కూటమి ప్రభుత్వం మనమిత్ర ద్వారా అవకాశం కల్పించి నాంది పలికిందన్నారు. దీని కోసం అధికార వాట్సప్ నంబరు 9552300009ను వినియోగించవచ్చన్నారు.



## మజ్జిగ పంపిణీ

**ప్రజాశక్తి-బంటుమిల్లి:** స్థానిక లక్ష్మీపురం సెంటర్లో మంగళవారం శ్రీ వినాయక నాయి బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ప్రయాణికులు, పాదచారులు దాహార్తి తీర్చేందుకు మజ్జిగ పంపిణీ చేశారు. బంటుమిల్లి ఎస్ఐ ఏ గణేష్ కుమార్ మజ్జిగ పంపిణీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాటూరి కుమార్, పొదిలి వెంకన్న, దేవరపల్లి శ్రీను, మేడూరి శివ సాయిబాబు, ముత్యాలపల్లి దుర్గారావు పాల్గొన్నారు.



## వివిన్‌పురంలో చోరీ

**ప్రజాశక్తి-గన్నవరం:** గన్నవరం మండలం కేసరపల్లి శివారు వెంకట నరసింహపురంలో యలమర్తి దుర్గారావు ఇంట్లో మంగళవారం తెల్లవారుజామున చోరీ జరిగింది. దుర్గారావు ఇంటి తాళాలు వేసి గ్రామాంతరం వెళ్లాడు. దొంగలు ఇంటి తాళాలు పగలగొట్టి లోపలకు వెళ్లి వెండి నగలు, 5 వేలు నగదు ఎత్తుకుపోయారు. బాధితుడు ఫిర్యాదు మేరకు పోలీసుల కేసు నమోదు చేశారు.

## చేబ్రోలు భాస్కరరావు వర్ధంతి

**ప్రజాశక్తి-మొవ్వ :** సిపిఎం జిల్లా నాయకులు, మొవ్వ మండలం కార్యదర్శి చేబ్రోలు భాస్కరరావు నాలుగో వర్ధంతి సభ మొవ్వ జెజె నగర్‌లో సోమవారం జరిగింది. భాస్కరరావు స్థూపంపై జెండాను సిపిఎం సీనియర్ నాయకులు మద్దుల బసవరావు ఆవిష్కరించారు. భాస్కరరావు స్థూపానికి స్థానిక శాఖ కార్యదర్శి కాకి రాజశేఖర్, మండల కార్యదర్శి శీలం నారాయణరావు, పూలదండతో నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు కొడాలి కరుణాకర్‌రావు, సభ్యులు కొడాలి శ్రీనివాసరావు, తప్పెట లాజరు, రావూరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.



# నేడు విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా 'ప్రజాభేరి'

## విస్తృతంగా సిపిఎం ఆధ్వర్యాన సంతకాల సేకరణ

**స్మార్ట్ మీటర్లు మాకొద్దని, సర్దుబాటు చార్జీల పేరిట విపరీతంగా పెరుగుతున్న కరెంటు చార్జీలను రద్దు చేయాలని కోరుతూ ఈనెల 7న గుణదల విద్యుత్ సౌధా వద్ద సిపిఎం ఆధ్వర్యంలో జరుగుతున్న 'ప్రజాభేరి'ని జయప్రదం చేయాలని నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం పలుచోట్ల సంతకాల సేకరణ, నిరసన కార్యక్రమాలు చేపట్టారు.**

**ప్రజాశక్తి - వన్‌టౌన్ :** విద్యుత్ ఛార్జీల భారాలతో ఆంధ్ర రాష్ట్ర ప్రజలు బాధలు పడుతున్నారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్ బాబురావు, సిపిఎం నగరపాల సంస్థ ఫ్లోర్ లీడర్, సిపిఎం పశ్చిమ నగర్ కార్యదర్శి బోయి సత్యబాబు అన్నారు. మంగళవారం సామారాంగ్ చౌక్ నుండి కాళేశ్వరరావు మార్కెట్ సెంటర్ వరకు ప్రజల సంతకాలు సేకరిస్తూ చైతన్యం చేశారు. ఈ సందర్భంగా సిహెచ్ బాబురావు, బి సత్యబాబు మాట్లాడుతూ యాక్సెస్ ఎనర్జీ ఒప్పందాలు, సోలార్ విద్యుత్తు కూటమి ప్రభుత్వం. యూనిట్ 4. 60 పైసలు చొప్పున నిర్ణయిస్తూ అవినీతి ఒప్పందాల్లో మొనగాడుగా నిలిచిందన్నారు. 10 నెలలోనే 16 వేల కోట్ల భారాలు మోపి ఉక్కిరిబిక్కు చేసిందన్నారు. యాక్సిస్ ఎనర్జీ ఒప్పందాలు తో మరో 15 వేల కోట్లు భారం రాష్ట్ర ప్రజలపై వేయబోతున్నారని తెలిపారు. ఈ భారాలకు వ్యతిరేకంగా 7న నిర్వహిస్తున్న ధర్నాను ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఈవి నారాయణ , నగర కమిటీ సభ్యులు జి.వెంకటరావు, నాయకులు సిహెచ్.దాసు, వెంకటరెడ్డి, రమణారెడ్డి, దుర్గాప్రసాద్, రామారావు పాల్గొన్నారు. **విజయవాడ :** విద్యుత్ ఛార్జీల భారాలను రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్లు పెట్టొద్దని సిపిఎం ప్రజాభేరి కార్యక్రమంలో భాగంగా కృష్ణలంక 21వ డివిజన్ సత్యంగారి హోటల్ సెంటర్ వద్ద మంగళవారం సంతకాల సేకరణ చేపట్టారు. విద్యుత్ సర్దుబాటు చార్జీలను రద్దు చేయాలని, విద్యుత్ భారాలు తగ్గించాలని కృష్ణలంకలోని పలు డివిజన్ల ప్రజలు శిభిరం వద్దకు చేరుకొని సంతకాలు ద్వారా వారి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజలపై మోయలేని విద్యుత్ భారాలను మోపుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం తూర్పు నగర కార్యదర్శి పి.కృష్ణ, నగర కార్యదర్శివర్గ సభ్యులు కోరాడ రమణ స్థానిక నాయకులు కె.కుమార్, కోరాడ నారాయణరావు, కొరివి నాగరాజు పాల్గొన్నారు. విజయవాడ సెంట్రల్ సిటీ ఆటో వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో రైల్వే స్టేషన్ మెయిన్ గేటు వద్ద ఆటో కార్మికుల నిరసన తెలుపుతూ 'సంతకాల' సేకరణ చేశారు. ఈ సందర్భంగా సెంట్రల్ సిటీ ఆటో వర్కర్స్ యూనియన్ సిఐటియు ప్రధాన కార్యదర్శి యం.హను మంతరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రైల్వే స్టేషన్ ఆటో వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు ఎ.వి రెడ్డి, చిన్న రహిమాన్, సైఫుల్లా, వేముల శివ పాల్గొన్నారు. ఇళ్ళకు స్మార్ట్ మీటర్లు పెట్టొద్దని కోరుతూ కృష్ణలంక 22 డివిజన్‌లో ఇంటింటికీ స్టిక్కర్లను అతికించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ తూర్పు సిటీ కమిటీ కార్యదర్శివర్గ సభ్యులు బత్తుల చిన్నారావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు టి.తాండవ కృష్ణ, కె.రమణయ్య, జూపూడి బాబు తదితరులు పాల్గొన్నారు. సిపిఎం సెంట్రల్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో సింగ్ నగర్ డాబా కొట్ల సెంటర్ వద్ద ప్రచార కార్యక్రమంలో భాగంగా సంతకాల సేకరణ జరిగింది. ఈ సందర్భంగా సెంట్రల్ సిటీ కార్యదర్శి బి.రమణారావు, కె దుర్గారావు మాట్లాడారు. సిపిఎం నగర కమిటీ సభ్యులు ఎస్.కె.నిజాముద్దీన్, ఎస్‌కె.పీర్ సాహెబ్, పి.వెంకట్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు. 17వ డివిజన్ రాణిగారితోటలో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. **వన్‌టౌన్ :** 50వ డివిజన్ గొల్లపాలెం గట్టు క్వారీ ప్రాంతంలో ప్రజాభేరిలో భాగంగా సంతకాల సేకరణ కార్యక్రమం సిపిఎం ఫ్లోర్ లీడర్, పశ్చిమ నగర కమిటీ కార్యదర్శి బోయి సత్యబాబు ప్రారంభించారు. బిజెపి, టిడిపి, వైసిపి, జనసేన ఆంధ్ర రాష్ట్ర ప్రజలను వంచించి భారాల మోపి ఆదాని బడా కార్పొరేట్ కంపెనీల లాభాలకు అవినీతి మూటలకు ఏకమయ్యారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు వి.స్వప్న, ఎస్.డి.భాష, స్థానికులు హకీం గురుమూర్తి, రాజ్యలక్ష్మి దుర్గా, తదితరులు పాల్గొన్నారు.



వన్‌టౌన్‌లో సంతకాల సేకరణలో పాల్గొన్న బాబూరావు, సత్యబాబు




సింగ్‌నగర్‌లో విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్న దుర్గారావు, నాయకులు

# 20న లేబర్ కోడ్స్ రద్దు చేయాలని సమ్మె

## జిల్లావ్యాప్తంగా సమ్మె నోటీసులు అందజేసిన ఆశాలు

**ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం :** కార్మికులను బానిసలుగా మార్చే లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, ఆశాలతో పాటు స్కీం వర్కర్లను అందరిని పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం చట్టబద్ధ సౌకర్యాలు కల్పించాలని కేంద్ర కార్మిక సంఘాల పిలుపుమేరకు మే 20న జరుగుతున్న దేశవ్యాప్త సమ్మెకు ఆశా వర్కర్లందరూ పాల్గొని జయప్రదం చేయాలని ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.కమల పిలుపునిచ్చారు. ఇబ్రహీంపట్నం, కొండపల్లి పిహెచ్‌సిల్లో సమ్మె నోటీస్ డాక్టర్స్‌కి అందజేశారు. ఆశాలపై పని ఒత్తిడి తీవ్రంగా ఉందని, మరో పక్క రిజిస్టర్ కొనుగోలు చేసి ఇస్తామని ప్రభుత్వం వైద్యాధికారులు తెలియజేసిన నేటికీ రిజిస్టర్లు అందక పోవడంతో ఆశాలపై ఒత్తిడి పెరుగుతుందని ఈ అంశాన్ని సామరస్యంగా పరిష్కరించాలని అన్నారు. అర్హులైన వారికి ఇల్లు, ఇళ్ల స్థలాలివ్వాలని డిమాండ్ చేశారు. ఇబ్రహీంపట్నం పిహెచ్‌సి ఆశా వర్కర్స్ లీడర్స్ మార్గరెట్, అంజలి, నాగమణి, ఇబ్రహీంపట్నం యుపిహెచ్‌సి లీడర్స్ సులోచన, సునీత, నిర్మల, కొండపల్లి రూరల్ పిహెచ్‌సి లీడర్స్ ప్రసన్న విజయ లీలా, నాగరత్నమ్మ, నాగమణి, కోటేశ్వరమ్మ, కొండపల్లి పిహెచ్‌సి లీడర్స్ మీనా, ఉషా, సునీత, లక్ష్మి, అనురాధ తదితరులు పాల్గొన్నారు. **విజయవాడ :** ఈ నెల 20న జరిగే ఆల్ ఇండియా సమ్మెలో జిల్లాలోని గ్రామ పంచాయితీ కార్మికులు పాల్గొంటున్నారని, అందుకు సంబంధించిన సమ్మె నోటీసును జిల్లా డిపిఒ కె.లావణ్య కుమారికి సిఐటియు నాయకులు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు ఎం.సోమేశ్వరరావు మాట్లాడుతూ నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, కాంట్రాక్టు, అవుట్సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, పంచాయితీ కార్మికులకు కనీస వేతనం 26 వేలు ఇవ్వాలని తదితర సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు విజయవాడ రూరల్ కార్యదర్శి పి. నరసింహారావు, పంచాయతీ యూనియన్ నాయకులు రామకోటయ్య, సిఐటియు నాయకులు అశ్రు నికాంత్ పాల్గొన్నారు. **నందిగామ :** మే 20 నుండి మూడు రోజులు మున్సిపల్ పారిశుధ్య కార్మికుల సమ్మె జరుగుతుందని సిఐటియు జిల్లా కార్యదర్శి కె.గోపాల్ పేర్కొన్నారు. మంగళవారం నందిగామ మున్సిపల్ కమిషనర్ ఈవి రమణ బాబుకు నాయకులు సమ్మె నోటీసు అందింజేశారు.. రాష్ట్ర వ్యాప్తంగా స్థానిక సమస్యలు పరిష్కారం కోసం సమ్మెలో భాగంగా మే 21, 22 తేదీల్లో కూడా రాష్ట్రంలో సమ్మె కొనసాగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి కె.గోపాల్ మాట్లాడుతూ నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులందరినీ పర్మిట్ చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థలను పరిరక్షించాలన్నారు. గ్రాడ్యుటీ అమలు చేయాలని కోరారు. గతంలో 17 రోజులు సమ్మె ఫలితంగా చేసిన హామీలు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు కరి వెంకటేశ్వరావు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి దాసరి సైదా, పాల్గొన్నారు. **విస్సన్నపేట :** ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఎన్టీఆర్ జిల్లా విస్సన్నపేట మండలంలో ఉపాధి హామీ పర్యటన మంగళవారం విస్సన్నపేట, తాతకుంట్ల, మారెమండ గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి కోట కళ్యాణ్ మాట్లాడుతూ ఉపాధి హామీలో బడ్జెట్ పెంచాలని కూలీలకు 200 రోజులు పని దినాలు రూ.600 లు కనీస వేతనం ఇవ్వాలని వేసవి అలవెన్స్ ఇవ్వాలని అలాగే కనీస సౌకర్యాలు కల్పించాలని కోరుతూ దేశవ్యాప్తంగా ఈనెల 20వ తారీకు జరుగుతున్న సమ్మె లో ఉపాధి కూలీలు కూడా పెద్ద ఎత్తున సమ్మెలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు విస్సంపల్లి నాగరాజు ఉపాధ్యక్షులు పానం ఆనందరావు రాష్ట్ర కమిటీ సభ్యురాలు జవలమ్మ జిల్లా కమిటీ సభ్యులు నక్క రుక్మిణి సోని ఆడిమిల్లి కిషోర్ గద్దల రామకృష్ణ, ఉపాధి మేట్లు కూలీలు పాల్గొన్నారు. **మైలవరం :** ఆశ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా అధ్యక్షురాలు పత్తిపాటి జ్యోతి ఆధ్వర్యంలో ఆశ వర్కర్స్ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని చంద్రాల పిహెచ్‌సి డాక్టర్‌కు సమ్మె నోటీసును అందజేశారు. కార్యక్రమంలో చంద్రాల పిహెచ్‌సి ఆశా వర్కర్స్ యూనియన్ సభ్యులు జి సంతోషం, రమణ, జయ, జయలక్ష్మి, ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు. **గంపలగూడెం :** ఈ నెల 20న తలపెట్టిన సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు మద్దిరెడ్డి వెంకటరెడ్డి కోరారు. ఈ మేరకు ఆశ వర్కర్లతో స్థానిక ప్రాథమిక ఆసుపత్రికి చేరుకొని సమ్మె నోటీసులు వైద్యాధికారి భార్గవికి అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి జానపాటి వెంకటేశ్వరరావు పాల్గొని మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ఉన్న ఆశా వర్కర్లు సమిష్టిగా పాల్గొనాలని కోరారు. **తిరువూరు :** సిఐటియు తిరువూరు మండల కార్యదర్శి బలగాని వెంకటేశ్వరావు ఆధ్వర్యంలో ఆశా వర్కర్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులకు సమ్మె నోటీసులు మంగళవారం అందజేశారు. మం డలంలోని తిరువూరు అర్బన్, చౌటపల్లి, రాజు గూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సమ్మె నోటీ సులు ఇచ్చినట్లు సిఐటియు మండల కార్యదర్శి బి. వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు సంధ్యా, చిట్టెమ్మ, సునీత, ఉషా, సునీత, లక్ష్మీ పాల్గొన్నారు



ఇబ్రహీంపట్నం పిహెచ్‌సి వైద్యులకు సమ్మె నోటీసు అందజేస్తున్న కమల, మహేష్, తదితరులు

## మజ్జిగ పంపిణీ

**ప్రజాశక్తి - మైలవరం :** స్థానిక లక్కిరెడ్డి హనిమిరెడ్డి కాంప్లెక్స్ వద్ద ఏర్పాటుచేసిన చలివేంద్రం శిబిరంలో మంగళవారం మైలవరం సెంట్రల్ బ్యాంక్ సహకారంతో మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని ఎఎంసి మాజీ చైర్మన్ అప్పిడి సత్యనారాయణ రెడ్డి, మైలవరం సెంట్రల్ బ్యాంక్ మేనేజర్ వంశీకృష్ణలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు మజ్జిగ పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. ప్రతి ఏడాది హనిమిరెడ్డి కాంప్లెక్స్ వద్ద వేసవిలో శిబిరాన్ని ఏర్పాటు చేసి మజ్జిగతో పాటు, కూలింగ్ వాటర్‌ను అందిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐ నీడ్స్ ఆప్టికల్స్ పుల్లారెడ్డి, ఆలమూరు చంద్రం, శివ, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

## బ్యాడ్మింటన్ కోచ్‌గా గోపి

**ప్రజాశక్తి - జగ్గయ్యపేట :** ఖేలో ఇండియా యూత్ గేమ్స్ 2025 ఈ నెల 8వ తేదీ నుండి 14వ తేదీ వరకు బీహార్ రాష్ట్రం భాగల్పూర్‌లో జరుగనున్నాయి. ఈ పోటీల్లో బ్యాడ్మింటన్ నేషనల్ గేమ్స్ జరుగ నున్నాయి. జగ్గయ్యపేటకు చెందిన కెవికె ఇండోర్ స్టేడియం బ్యాడ్మింటన్ కోచ్ కీసర గోపి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బ్యాడ్మింటన్ కోచ్‌గా ఈ రాష్ట్రాన్ని ప్రతినిధిగా ప్రాతినిధ్యం వహించనున్నారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు క్రీడాకారులు శుభాకాంక్షలు తెలిపారు.

## అన్న క్యాంటీన్‌లో అన్నప్రసాద వితరణ

**ప్రజాశక్తి - జగ్గయ్యపేట :** పట్టణానికి చెందిన రిటైర్డ్ తహశీల్దార్ బొల్లేపల్లి భోజరాజు మనమడు దర్శిత్ అన్నప్రాసన సందర్భంగా మంగళవారం పట్టణంలో అన్న క్యాంటీన్‌లో ఏర్పాటు చేసిన అన్నప్రసాద వితరణను జిల్లా టిడిపి అధ్యక్షులు నెట్టెం శ్రీ రఘురామ్, శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ తాతయ్య ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గింజుపల్లి రమేష్, మైనేని రాధాకృష్ణ, ధూళిపాళ్ల లక్ష్మణరావు, కళ్యాణం కృష్ణారావు, పెంటేల పూర్ణయ్య, వెల్ది శ్రీనివాసరావు మరియు భోజరాజు కుటుంబ సభ్యులు సత్యనారాయణ రాజు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా అంగన్వాడీ అధ్యక్షురాలికి అభినందనలు

**ప్రజాశక్తి - జగ్గయ్యపేట :** పట్టణంలోని జగ్గయ్యపేట నియోజకవర్గ వైసిపి కార్యాలయంలో ఇటీవల కాలంలో నందిగామకు చెందిన శాఖమూరి వెంకట కుమారి జిల్లా అంగన్వాడీ విభాగ అధ్యక్షురాలుగా నియమితులైన సందర్భంగా జగ్గయ్యపేట నియోజకవర్గం వైసిపి ఇన్–ఛార్జ్ తన్నీరు నాగేశ్వరరావును మర్యాదపూర్వకంగా కలిసిన సందర్భంగా వారిని సన్మానించి శుభాకాంక్షలు తెలిపిన నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జ్ తన్నీరు నాగేశ్వరరావు, నియోజకవర్గ మహిళా నాయకులు, వైసిపి వివిధ అనుబంధ విభాగాల నాయకులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాద బాధితులకు పరామర్శ

**ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం :** మూలపాడు వద్ద రోడ్డు ప్రమాదంలో సోమవారం తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న బాధితులను మైలవరం ఎంఎల్ఎ వసంత వెంకట కృష్ణ ప్రసాదు మంగళవారం పరామర్శించారు. వారు పూర్తిగా కోలుకునే వరకు మెరుగైన వైద్యం అందించాలని ఆసుపత్రి వైద్యులను కోరారు. ఇబ్రహీంపట్నంకు చెందిన 9 మంది మహిళా వ్యవసాయ కూలీలు పనుల నిమిత్తం ఆటోలో వెళ్తూ మండలంలోని మూలపాడు వద్ద జాతీయ రహదారిపై సోమవారం రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. ఈ ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందగా, మరో ఏడుగురు కూలీలు తీవ్రంగా గాయపడ్డారు. ఏడుగురు మహిళల్లో అతి తీవ్రంగా గాయపడిన ముడావతు గౌరీ, కన్నెగంటి స్వప్న, వి.మరియమ్మ గొల్లపూడిలోని ఆంధ్రా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. చింత వసంత, షేక్ మౌలాబీ, వెంకట కుమారి, తుపాకుల దుర్గ విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

## గ్రామపంచాయతీలో కిశోర వికాసం

**ప్రజాశక్తి - వత్సవాయి :** మండల కేంద్రమైన పెనుగంచిప్రోలు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఐసిడిఎస్ ప్రాజెక్ట్ చిల్లకల్లు సిడిపివో లక్ష్మీ భార్గవి ఆదేశాల మేరకు సూపర్వైజర్ ఉషారాణి ఆధ్వర్యంలో గ్రామపంచాయతీలో కిశోరే వికాసం ప్రోగ్రాం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా 11 – 18 సంవత్సరాల పిల్లలకు వ్యక్తిగత శుభ్రత గురించి వివరించారు. ఆటలు పాటలు కోలాటాలు నేర్పించారు. మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ వేల్పుల పద్మ కుమారి, ఇఒ శ్యామ్ ఎఎన్ఎం కృష్ణవేణి ఎమ్మెస్ కె.సరిత మాట్లాడుతూ పిల్లలకు గుడ్ టచ్ బ్యాడ్ టచ్ గురించి కూడా వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు హెల్పర్లు తల్లులు పాల్గొన్నారు.

# రైతులకు వర్ష భయం



ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతు

**ప్రజాశక్తి-గన్నవరం:** అకాల వర్షాలతో గన్నవరం నియోజకవర్గంలో రైతులు బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు. వారం రోజుల నుంచి కురిసిన వర్షాలు, వీచిన ఈదురు గాలులకు వందల ఎకరాల్లో దాళ్వా వరి నేల వాలింది. ఆరపెట్టిన ధాన్యం తడిసిపోయింది. ఎండలు కాస్తుండడంతో రైతులు యంత్రాలతో పంట కోయించి కల్లాల్లో, రహదారులపై ధాన్యం ఆర బెడుతున్నారు. తాజాగా అకాల వర్షాలు ప్రభావంతో మంగళవారం ఆకాశం మేఘావతమైంది. ఈదురు గాలులు వీయడంతో చేతికి అందొచ్చిన వరి పంట నేలవాలిందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్ష సూచనతో మూడ్రోజుల వరకు వరి కోతలు, నూర్చిడీలు చేయరాదని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. నేలవాలిన పైరు కోయా లన్నా, యంత్రాలతో నూర్పిడి చేయాలన్నా ఎకరాకు అదనంగా రూ. రెండు నుంచి రూ.నాలుగు వేలు ఖర్చు చేయాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. ఇంతవరకూ ఎకరాకు రూ.15 వేల నుంచి రూ.18 వేల వరకు పెట్టు బడి పెట్టామని రైతులు వాపోతున్నారు. గన్నవరం మండలంలో ముస్తాబాద్, పురుషోత్తపట్నం, కేసరపల్లి, గూడవల్లి లో ఈదురు గాలులకు పంట పూర్తిగా నేలవాలింది. మండలంలో 500 ఎకరాల్లో దాళ్వా వరిసాగు చేశారు. పంట కోత దశలో వానపడడంతో నీరు బయటకు వెళ్లే మార్గంలేక రైతులు ఆందోళన చెందుతున్నారు. మరో వైపు ధాన్యంలో తేమ శాతంలో తేడాలు, గోనె సంచులు, రవాణాలో ఇబ్బందులు పడుతున్నారు. ధాన్యం బస్తాలకు నింపి లారీలకు ఎత్తాల్సి ఉంది. వాతావరణం అనుకూలించడంతో తేమ శాతం నిర్ధారిత 17 కంటే రెండు మూడు పాయింట్లు తక్కువగానే ఉంది. వారం రోజులుగా కల్లాలు, రహదారులపై పడి గాపులు పడుతుంటే పట్టించుకునేవారు కరవయ్యారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వానాలతో తేమ శాతం అధికమవుతుందని రాత్రి సమయాల్లో పరదాలు కప్పుతున్నామని చెప్పారు. ఖర్చులు పెరగడంతో పాటు దాన్యం తూకంలో తరుగుదల ఏర్పడుతుందని వాపో యారు. 17 శాతం కంటే ఎక్కువ ఉంటే బరువును తగ్గించినట్లుగానే, అంతకు లోపు ఉన్న ధాన్యానికి అదనంగా చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. ఇదే పరిస్థితి నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో నెలకొందని రైతులు చెబుతున్నారు.

## సమగ్ర శిక్ష ఎపిసిగా కుముద్ధినిసింగ్

**ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా):** కృష్ణా జిల్లా సమగ్ర శిక్ష ఏపీసిగా ఆర్.కుముద్ధిని సింగ్ నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. పల్నాడు జిల్లా కెఆర్ఆర్సి డిప్యూటీ కలెక్టర్గా విధులు నిర్వహిస్తున్న ఆర్.కుముద్ధిని సింగ్ను కృష్ణాజిల్లా ఏపీసిగా నియమించింది. ప్రస్తుతం సమగ్ర శిక్ష ఎపిసిగా జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి ఫణి ధూర్జటి ఇన్చార్జిగా వ్యవహరిస్తున్నారు.

## కార్మిక చట్టాలపై అవగాహన

**ప్రజాశక్తి-గన్నవరం:** కార్మికులకు చట్టపరమైన సమస్యలు వస్తే న్యాయవ్యవస్థ ద్వారా పరిష్కారం చూపుతామని గన్నవరం కోర్టు న్యాయమూర్తి అరుణశ్రీ చెప్పారు. మండల్ లెగల్ సెల్ ఆధ్వర్యంలో గన్నవరం రైతు బజార్లో మంగళవారం చట్టాలపై కార్మికులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రతి మనిషికి కొన్ని హక్కులు ఉంటాయని, వాటికి భంగం కలిగితే చట్టం ద్వారా, లేదంటే న్యాయవ్యవస్థ ద్వారా తగిన న్యాయం పొందవచ్చు అని చెప్పారు. మండల్ లేగల్ సెల్ ద్వారా ఉచితంగా మీ కేసులు వాదించి న్యాయం జరిగేలా చూస్తారన్నారు. మీ కుటుంబాల్లో ఏమైనా చట్టపరమైన సమస్యలు వస్తే వాటిని కూడా లీగల్ సెల్ అథారిటీ దష్టికి తీసుకురావచ్చు అన్నారు. న్యాయ వ్యవస్థను ప్రజల్లోకి తీసుకు వెళ్లాలని ఉద్దేశంతో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు వివరించారు. రైతు బజార్లో పనిచేసే కార్మికులు, వ్యాపారస్తులు వారికున్న నిబంధనలకు లోబడి వ్యవహరించాలన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు గారపాటి రవి, సీనియర్ న్యాయవాది రాజశ్రీ పాల్గొన్నారు.

# వార్డుల్లో ఎంఎల్ఎ రాము పర్యటన

**ప్రజాశక్తి-గుడివాడ :** నాడు సమస్యలకు నిలయమైన గుడివాడ నేడు అభివృద్ధికి నిలయంగా మారిందని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. మంగళవారం స్థానిక 7వ వార్డులో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మీకోసం – మీ వెనిగండ్ల పర్యటన నిర్వహించారు. ఇటీవల నిర్వహించిన పర్యటనలో డ్రైనేజీ సమస్యలపై ప్రజల నుండి వచ్చిన విజ్ఞప్తుల మేరకు మున్సిపల్ అధికారులతో కలిసి వార్డులోని కొత్తపేట పరిసర ఏరియాల్లో పర్యటించారు. వార్డు వ్యాప్తంగా డ్రైనేజీ సమస్యను పరిష్కరించేలా శాస్త్రీయ బద్దంగా డ్రైనేజి నిర్మాణానికి అంచనాలు రూపొందించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లుతో మాట్లాడుతూ ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు వార్డు పర్యటనలు నిర్వహిస్తున్నామన్నారు. వార్డు పర్యటనలో తన దష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి అన్ని విధాలుగా కషి చేస్తున్నానన్నారు. ఆర్థికపరమైన సమస్యలు పరిష్కారానికి కొంత సమయం పడుతుందని, ఇతర సమస్యలను తక్షణమే పరిశీలిస్తున్నట్లు తెలిపారు. గతంలో సమస్యలకు నిలయమైన గుడివాడలో నేడు అభివద్ధి పనులకు నిలయంగా మారబోతుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సింహాద్రి మనోహర్, అసిస్టెంట్ కమిషనర్ పి శ్రీనివాసరావు, డిఇ సతీష్ చంద్ర, ఏఇ రాజేష్, నాయకులు పండ్రాజు సాంబయ్య, గడ్డం ప్రకాష్దాస్, సయ్యద్ జబీన్, కునుకు మోహన మురళి, తేనెల ఏడుకొండలు, మంగరాజు, చిన్నారావు, పెద్దిరాజులు, కోసూరి ఆంజనేయులు, కోసూరి అంజి పాల్గొన్నారు.



వార్డులో పర్యటిస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

## భరత్బాబుకు అభినందన

**ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా):** అద్భుత ప్రదర్శనతో స్పెషల్ ఒలంపిక్ భారత్ కు ఎంపికైన ప్రత్యేక అవసరాలు గల విద్యార్థి భరత్ బాబును సమగ్ర శిక్ష కష్ణాజిల్లా అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ ముదిగొండ ఫణి ధూర్జటి అభినందించారు.కష్ణా జిల్లా కంకిపాడు భవిత సెంటర్ కు చెందిన ప్రత్యేక అవసరాలు గల విద్యార్థి వి.భరత్ బాబు ఇటీవల రాష్ట్ర స్థాయిలో హిల్ పారడైజ్ ఆగిరిపల్లి లో జరిగిన అటల పోటీలో వాలీబాల్ విభాగంలో మంచి ఆట తీరుని ప్రదర్శించి జాతీయస్థాయిలో జూన్ నెలలో అహ్మదాబాద్ లో జరగబోయే స్పెషల్ ఒలంపిక్ భారతకు ఎంపిక అయినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఏపీ సి మాట్లాడుతూ మనిషి తనకు నచ్చిన పనిని చేసుకుంటూ పోతే ఏదో ఒక రోజు విజయం తప్పక సాధ్యమవుతుందని భరత్ బాబు నిరూపించాడన్నారు. జాతీయస్థాయిలో కూడా మంచి ఆట తీరుని ప్రదర్శించి విజయం సాధించాలని జిల్లా సహిత విద్యా సమన్వయ కర్త, ఎస్. రాంబాబు ఆకాంక్షించారు.అలాగే ఉయ్యూరు భవిత కేంద్రంలో విద్యనభ్యసించే కష్ణ చైతన్య కాంస్య పతాకాన్ని సాధించడం పట్ల ఇరువురు విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు.

## డిప్లొమా కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానం

**ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా):** ఇండియన్ ఇన్స్టిట్యూట్ అప్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ, సేలం, తమిళనాడు డిప్లొమా ఇన్ హ్యాండ్ లూం అండ్ టెక్స్ టైల్ టెక్నాలజీ కోర్సు ప్రవేశము కొరకు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా చేనేత మరియు జౌళి సిహెచ్.సాయిప్రసాద్ తెలిపారు. పదో తరగతి లేదా తత్సమానమైన పరీక్షలో విద్యార్థులు ఉత్తీర్ణులు అయి ఉండాలన్నారు. దరఖాస్తులు www.iihtsalem.edu.in వెబ్సైట్లో చేయన్నారు. ఇతర వివరాలకు సెల్ నెంబరు 8008705709 ద్వారా సంప్రదించాలన్నారు.

# కిశోర బాలికలకు అవగాహన

**ప్రజాశక్తి – గుడివాడ :** గుడివాడ రూరల్ మండలంలోని బిళ్ళపాడు, మోటూరు, బొమ్ములూరు, దొండపాడు, చౌటపల్లి, గుంటాకోడూరు గ్రామాలలో కిశోరి వికాసం – వేసవి శిక్షణా శిబిరాలు మంగళవారం నిర్వహించారు. మోటూరు పిహెచ్సి మెడికల్ ఆఫీసర్ దీప్తి, విద్యార్థులకు రుతుక్రమం, పరిశుభ్రత, ఆహారం, లైంగిక విద్యపై అవగాహన కల్పించారు. ఐరన్, ప్రోటీన్ సమృద్ధిగా ఉండే ఆహారం తీసుకోవాలని, రక్తహీనతకు గురి కాకుండా ఐఎఫ్ఎ ట్యాబ్లెట్స్ వాడాలని అలాగే నడక, యోగాలాంటి సులభమైన వ్యాయామాలు చేయడం వలన నెలసరి సమయంలో వచ్చే నొప్పి కూడా తగ్గుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో సిడిపివో విజయ ఫ్లోరెన్స్, సూపర్వైజర్ నసీరున్నీసా, అశ, ఎఎన్ఎంలు, అంగన్ వాడీ టీచర్లు సిహెచ్ నిర్మలజ్యోతి, రేవతి, సభాషినీ, కోటేశ్వరమ్మ, విజయలక్ష్మీ, శ్యామల, రాజమణి, మహంకాళీ, రంగమ్మ, రాధిక, సువర్చల తదితరులు పాల్గొన్నారు. **గుడ్లవల్లేరు:** గుడ్లవల్లేరు మండలం విన్నకోట, కవుతరం సచివాలయ పరిధిలో అంగన్వాడి కేంద్రాల్లో కిశోర వికాసం 2.0 కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఐసిడిఎస్ సూపర్వైజర్ వాణి, విన్నకోట పంచాయితీ కార్యదర్శి అంగన్వాడీ కార్యకర్తలతో కలిసి చర్చా గోష్టులు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు. అంగన్వాడి కేంద్రాల్లో జరిగిన కార్యక్రమాలలో అంగన్వాడి కార్యకర్తలు, మల్టీపర్పస్ హెల్త్ వర్కర్లు, ఆశ వర్కర్లు, రిసోర్స్ పర్సన్స్, కిషోర్ బాలికలు పాల్గొన్నారు. **నందివాడ:** మండలంలోని పుట్టగుంట గ్రామపంచాయతీ పరిధిలోని గ్రామ సచివాలయంనందు మంగళవారం కిశోరీ వికాసం వేసవి కార్యక్రమాన్ని జిల్లా డిసిపిఓ జే.స్వరాజ్యం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కిషోర్ బాలికల వ్యక్తిగత పరిశుభ్రత మరియు లైంగిక, విద్యా వంటి పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ ఎన్.నాగ శిరీష, మహిళా పోలీస్ టి.రత్నకుమారి, ఏఎన్ఎం ఎస్.ఈశ్వరి పాల్గొన్నారు. **కంకిపాడు:** పెనమలూరు మండల పరిధిలోని గంగూరు, గోసాల, వణుకూరు గ్రామాలలో కిశోర వికాసం సమ్మర్ స్పెషల్ క్యాంపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా లీగల్ ఆఫీసర్ శైలజ, కంకిపాడు సీడీపీఓ బేబీ సుకన్య పాల్గొన్నారు.



బొమ్ములూరులో ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

## 'డ్రెయిన్పై తూములు తొలగించాలి'

**ప్రజాశక్తి-కోడూరు:** కోడూరు మండల పరిధిలోని ఇరాలి గ్రామం వద్ద రత్నకోడు మేజర్ డ్రైన్ నుంచి న్యూ ఇరాలి డ్రైన్లోకి అక్రమంగా వేసిన తూములు తొలగించకుండా న్యూ ఇరాలి డ్రైన్ పై 14 నెంబర్ పంట కాలువ వద్ద యూటీ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించడం ఏమిటని రైతు సంఘం నాయకులు రేపల్లే యోగ ప్రకాష్ ప్రశ్నించారు. మంగళవారం యోగప్రకాష్ దిగుప్రాంత రైతులతో కలిసి పాత్రికేయులతో మాట్లాడుతూ పాలకాయతిప్ప అవుట్ పాల్స్ స్లూయిస్ నిర్మాణం, రత్నకోడు నుంచి వేసిన అక్రమ తూములు తొలగింపు, పనులు చేపట్టిన తర్వాతే న్యూ ఇరాలి డ్రైన్ కి యూటీ ఏర్పాటు చేయాలని లేకుంటే ఈ ముంపు రెట్టింపు అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు జొన్నలగడ్డ గోపాలరావు, నాదెళ్ల ఈశ్వరరావు, చక్కా వెంకటేశ్వరావు, బాలగోపాల రామకృష్ణరాజు పాల్గొన్నారు.



## ఎంఎల్ఎ బుద్ధప్రసాద్కు సన్మానం

**ప్రజాశక్తి-అవనిగడ్డ:** ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ చొరవతో తమ రోడ్డు సమస్య పరిష్కారం అయిందని ఎంపీటీసీ సభ్యులు భాను తెలిపారు. మంగళవారం ఎమ్మెల్యే కార్యాలయంలో కొత్తపేట గ్రామ జనసేన పార్టీ ప్రతినిధులు నాయకులు బుద్ధప్రసాద్ను మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా బొప్పన భాను మాట్లాడుతూ గత కొన్ని ఏళ్ళ నుంచి అస్తవ్యస్త ఉన్న ప్రధాన రహదారి సమస్యతో ఇబ్బంది పడుతున్న తమ గ్రామానికి కూటమి ప్రభుత్వంలో పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో రూ.55 లక్షలు మంజూరు చేయించిన సందర్భంగా ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు ఎలవర్తి రాజేష్, గరికపాటి శ్రీను, దివి శ్రీను, భూపతి శ్రీను, ఎలవర్తి చిన్న, యలవర్తి ఆంజనేయులు పాల్గొన్నారు.

## ఓఎన్జిసిలో ఉద్యోగాలు కల్పించాలి : గౌతమ్

**ప్రజాశక్తి-అవనిగడ్డ:** నియోజకవర్గ పరిధిలోని నాగాయలంక మండలం బావ దేవరపల్లిలోని ఓఎన్జిసి ప్లాంట్లో స్థానిక నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని వైసీపీ యువనేత బడే గౌతం పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరికి లేఖ రాశారు. ఈ సందర్భంగా గౌతమ్ మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ ఓఎన్జిసి ప్లాంట్ నుండి ముడిచమురుతో పాటు వెలికి తీస్తున్న గ్యాస్ ఇక్కడ నుండి వేలాది ట్యాంకర్లతో తరలిస్తూ ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని అన్ని ఫీలింగ్ స్టేషన్స్కు గ్యాస్ సరఫరా అవుతుందన్నారు. ఓఎన్జిసి ప్లాంట్ వస్తే నిరుద్యోగ యువతకు ఎన్నో ఉద్యోగ అవకాశాలు వస్తాయని ఎదురు చూడగా అది చివరకు తీవ్ర నిరాశగానే మిగిలిందన్నారు. విపరీతమైన డ్రిల్లింగ్ వల్ల భవిష్యత్తు కాలంలో దివిసీమ తీవ్ర భూకంపనలను ఎదుర్కోవాల్సి వస్తుందని అనుమానాలపై ప్రజలకు ఓఎన్జిసి వారు తీసుకున్న తీసుకోబోతున్న తగు జాగ్రత్తలు ఏమిటో వివరణ ప్రజలకు ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు.

## మత్స్య భవనాన్ని బాగు చేయాలని వినతి

**ప్రజాశక్తి-అవనిగడ్డ:** గతేడాది కృష్ణా నదికి వచ్చిన వరదల కారణంగా ధ్వంసమైన మత్స్య భవనం ప్లాట్ఫారం మరమ్మతులు చేయించాలని మత్స్యకార సహకార సంఘాల అధ్యక్షులు ఆంజనేయులు, కర్రి కృష్ణమూర్తి ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం అవనిగడ్డ మత్స్య శాఖ సహాయ సంచాలకులు ఆర్.ప్రతిభకు ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సముద్రంలో చేపల వేట నిషేధం ముగిసేలోపు ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం కింద వివిధ స్కీమ్స్కు ఎంపికైన లబ్ధిదారులకు ఆయా యూనిట్లను అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార నాయకులు నాగిడి తాతారావు, లంకే శ్రీనివాస ప్రసాద్ పాల్గొన్నారు.

## సహకార సంఘాలు ఉత్తమ సేవలందించాలి

**ప్రజాశక్తి – గుడివాడ:** ప్రజలకు సహకార సంవత్సరం సందర్భంగా ది గుడివాడ కో– ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ ఉత్తమమైన సేవలను అందించాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. మంగళవారం స్థానిక బస్టాండు సమీపంలోని ది గుడివాడ కో – ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్లో అంతర్జాతీయ సహకార సంవత్సరం కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పాల్గొని బ్యాంక్ లావాదేవీలు తదితర అంశాలపై చర్చించారు. అనంతరం ఉద్యోగులకు, సిబ్బందికి అంతర్జాతీయ సహకారం సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి కె.చంద్రశేఖరరెడ్డి, సిహెచ్ రవికుమార్, బ్యాంక్ సిఇఓ చౌదరి, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

# 80 లక్షల పనిదినాల కల్పనే లక్ష్యం : కలెక్టర్ లక్ష్మీశ

**ప్రజాశక్తి - కంచికచర్ల :** జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా పని కోరిన శ్రామికులకు ఈ ఏడాది జిల్లాలో 80 లక్షల పనిదినాలను కల్పించాలనే లక్ష్యాన్ని పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ లక్ష్మీశ ఆ శాఖ అధికారులను ఆదేశించారు. శ్రామికులకు 307 రూపాయల కనీస వేతనం కల్పించి ఆర్థిక ఊతం ఇవ్వాలని మూడు వేల పంట కుంటలతో పాటు నాలుగు వేల ఎకరాలలో ఉద్యాన పంటల పనులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామి పథకం ద్వారా జిల్లా నీటి యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉపాధి హామీ పనులను మంగళవారం జిల్లా కలెక్టర్ లక్ష్మీశ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కంచికచర్ల మండలం పరిటాలలో పంట కుంట, ఫీడర్ చానల్ నిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించారు. ఉదయం మోటర్ బైక్‌పై సుడిగాలి పర్యటనతో ఉపాధి హామీ పనులను పరిశీలించిన అనంతరం అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఉపాధి హామి పథకం ద్వారా చేపట్టిన పనులు అత్యంత పారదర్శకత నాణ్యత ప్రమాణాలతో పూర్తి చేయాలన్నారు. ఈ ఏడాది శ్రామికులకు 80 లక్షల పని దినాలను కల్పించాలన్నది లక్ష్యం కాగా ఇప్పటి వరకు 25 లక్షల పని దినాలను కల్పించినట్లు తెలిపారు. మండు వేసవిని దృష్టిలో పెట్టుకుని వేకువజామునే పనులు మొదలు పెట్టి 10 గంటల సమయానికి పనులను నిలిపి వేయాలన్నారు. పనులు నిర్వహిస్తున్న ప్రదేశాల్లో శ్రామికులకు వేసవి షెడ్‌లను, తాగునీరు ఏర్పాటు చేయాలని, అత్యవసర మందులతో కూడిన మెడికల్ కిట్లను ఒఆర్‌ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఉపాధి హామి పనులలో భాగంగా అమత సరోవర్ చెరువుల తవ్వకం, కందకాల తవ్వకం, రూఫ్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్ల నిర్మాణం, కమ్యూనిటీ సోప్ పిట్ల నిర్మాణం, చెరువు, కాలువ గట్లపై మొక్కల పెంపకం చేపట్టాలన్నారు. పూల, పండ్ల తోటలు రైతులు పంట కుంటలను నిర్మించుకునేందుకు ముందుకు వస్తే తక్షణమే పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధి హామీ పనుల పరిశీలనలో కలెక్టర్ వెంట జాతీయ ఉపాధి హామీ పథకం ప్రాజెక్టు డైరెక్టర్ ఎ.రాము, నందిగామ ఆర్‌డిఒ కె.బాలకృష్ణ, కంచికచర్ల ఎంపిడిఒ బి.లక్ష్మీకుమారి, ఎపిడి వెంకటేశ్వర రావు, ఎపిఒలు ప్రమీల, రమాదేవి, ఇంజనీరింగ్ కన్సల్‌టెంట్స్ సతీష్ చంద్ర, జనార్ధన్, ఉపాధి హామి సిబ్బంది ఉన్నారు.



ద్విచక్రవాహనంపై వెళ్తున్న కలెక్టర్



ఉపాధి పనులు పరిశీలించి వారితో చేయి కలిపిన కలెక్టర్

## సాల్వ్ ఫర్ టుమారో 2025 పోటీ ప్రారంభం

**ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ :** అతిపెద్ద వినియోగదారు ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ సామ్‌సంగ్, తమ 'సాల్వ్ ఫర్ టుమారో' 2025 పోటీ కార్యక్రమం నాల్గో ఎడిషన్ ప్రారంభించినట్లు నిర్వాహకులు కె.శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇది సాంకేతికతను ఉపయోగించుకోవడం ద్వారా సమాజంలోని కొన్ని ముఖ్యమైన సవాళ్లను పరిష్కరించడానికి విద్యార్థులను వినూత్న పరిష్కారాలను రూపొందించడానికి ప్రేరేపించడానికి ఈ పోటీ రూపొందించబడిందన్నారు. సామ్‌సంగ్ 'సాల్వ్ ఫర్ టుమారో 2025' మొదటి నాలుగు విజేత జట్లకు వారి ప్రాజెక్టుల ఇంక్యుబేషన్‌కు మద్దతు ఇవ్వడానికి రూ.1 కోటి అందిస్తుందన్నారు. సామ్‌సంగ్ ఉన్నతాధికారులు, ఐఐటీ ఢిల్లీ అధ్యాపకుల నుండి ఆచరణాత్మక నమూనా తయారీలో మద్దతు, ఇన్వెస్టర్ల సంబంధాలు, నిపుణుల మార్గదర్శకత్వం లభిస్తాయని, ఈ విధమైన గుర్తింపు అనేది పోటీలో రాణించడమే కాకుండా సమస్యలను అధిగమించే పరిష్కారాలను పెంపొందించడం ప్రాముఖ్యతను చాటి చెబుతుందని తెలిపారు. అంతిమంగా కమ్యూనిటీలను రూపొందించడంలో కీలకపాత్ర పోషించే ఉన్నతస్థాయి, సుస్థిర వెంచర్‌లుగా అభివృద్ధి చెందుతుందని తెలిపారు. వివరాలకు సాల్వ్ ఫర్ టుమారో వెబ్‌సైట్ ద్వారా వివరాలు తెలుసుకోవచ్చని తెలిపారు.




## ఆటోమోటివ్ షోరూం ప్రారంభం

**ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ :** అతిపెద్ద ఆటోమొబైల్ రిటైల్ సంస్థలలో ఒకటైన ఆటోమోటివ్ మానుఫ్యాక్చరర్స్ ప్రైవేట్ లిమిటెడ్ విజయవాడలో మంగళవారం మహీంద్రా డీలర్షిప్‌ను ప్రారంభించింది. ఈ కార్యక్రమంలో మహీంద్రా నుండి వీపీ-సేల్స్, కస్టమర్ కేర్ సీఎక్స్ పవన్ కుమార్, ప్రెసిడెంట్ అండ్ నేషనల్ సేల్స్ హెడ్ ఐనేశ్వర్ బెనర్జీ, "ఇరు సంస్థల నుంచి ఇతర సీనియర్ ఆఫీసర్ హాజరయ్యారు. విజయవాడలోని ఏలూరు రోడ్డు, ఎనికెపాడులోనిర్మించిన షోరూంలో ఆధునిక 3ఎస్ (సేల్స్, సర్వీస్, స్పేర్స్) సౌకర్యం 1.03 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉంది అని పవన్ కుమార్ తెలిపారు. ఇందులో 14 వాహనాలను ఒకేసారి ప్రదర్శించగల విశాలమైన షోరూమ్ ఉందన్నారు. మహీంద్రా విస్తృత శ్రేణి వాహనాలు - ప్యాసింజర్ వెహికల్ (ఐసీఈ, ఈవీ), స్మాల్ కమర్షియల్ వెహికల్ (ఎస్సీవీ), లాస్ట్ మైల్ మొబిలిటీ (ఎల్పందిం) అన్నీ ఒకే చోట లభిస్తాయని తెలిపారు. ఈ కొత్త సౌకర్యం వాహన విక్రయాలు, అమ్మకాల తర్వాత సేవలతో పాటు వాహన ఫాస్ట్ ఛార్జింగ్ సౌకర్యాన్ని అందించేలా రూపొందిందని తెలిపారు. అద్భుత రంగుల సమ్మేళనం, ఆకర్షణీయమైన లైటింగ్, సహజమైన సాంకేతికతతో షోరూమ్‌ను ప్రతి అంశం అభివద్ధిపరమైన డిజైన్. అవిష్కరణ, ఆకర్షించేలా రూపొందించారని తెలిపారు.

## ఆస్తమాపై అవగాహన అవసరం

**ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ :** ఆస్తమా విషయంలో ప్రతి ఒక్కరూ జాగర్తగా ఉండాలని ప్రముఖ వైద్యులు డాక్టర్ ఎం.ఎస్. గోపాల కష్ణ అన్నారు. ప్రపంచ ఆస్తమా దినోత్సవం సందర్భంగా నగరంలో అవగాహనా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'అందరికీ పీల్చే చికిత్సను అందుబాటులోకి తీసుకురావడం' అనే (గ్లోబల్ ఇనిషియేటివ్ ఫర్ ఆస్తమా) థీమ్ గుర్తించబడిన ఈ సంవత్సరం ప్రపంచ ఆస్తమా దినోత్సవం భారతదేశ ప్రజారోగ్య ప్రయాణంలో కీలకమైన సమయంలో వస్తుందని అన్నారు. 'ఆస్తమా నిర్వహణ ప్రాథమిక లక్ష్యాలు లక్షణాలను నియంత్రించడంపై అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. రెస్క్యూ మందులపై ఆధారపడటాన్ని తగ్గించడం, అసుపత్రిలో చేరకుండా నిరోధించడం ఊపిరితిత్తుల పనితీరును కాపాడటం చివరికి జీవన నాణ్యతను మెరుగుపరచడం వంటి విషయాలు తెలుసుకోవాలన్నారు. ఈ ఫలితాలను సాధించడానికి సకాలంలో రోగ నిర్ధారణ, సరైన ఇన్హేలర్ వాడకం స్థిరమైన కట్టుబడి ఉండటం అవసరమన్నారు.

# కృష్ణా జలాలిచ్చి మా ప్రాణాలు కాపాడండి

### కిడ్నీ బాధితులు, గిరిజనులు

**ప్రజాశక్తి - ఎ.కొండూరు :** ఎ.కొండూరు మండలంలో నిలిచిపోయిన కృష్ణా జలాలను తిరిగి పునరుద్ధరించి దాహంతో కేకలు వేస్తున్న కిడ్నీ బాధితులను, తమను ఆదుకోవాలని సిపిఎం ఆధ్వర్యంలో మండలంలోని ఎ.కొండూరు చైతన్య నగర్ తండాలో సరఫరా నిలిచిపోయిన మంచినీరు ట్యాంకు వద్ద మంగళవారం గిరిజనులు ఆందోళన చేశారు. మండలంలో గత వారం రోజుల నుండి కృష్ణా జలాలు ఆగిపోవడంతో తాగునీటి కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని సిపిఎం మండల కార్యదర్శి పానెం ఆనందరావు ఆవేదన వ్యక్తం చేశారు. అన్నారు చైతన్య నగర్ తండాలో సిపిఎం ఆధ్వర్యంలో మంచినీళ్ల ట్యాంకు ముందు ధర్నా నిర్వహించారు. కిడ్నీ బాధితులు మాట్లాడుతూ కృష్ణా జలాలు తాగటం వల్ల మోకాళ్ళ, ఒళ్ళు నొప్పులు కొంతవరకు మెరుగు పడ్డాయని, ఈనీళ్ల ఆగిపోవడంతో వేరే నీళ్ల తాగడం వల్ల మళ్ళీ నొప్పులు మొదలయ్యాయన్నారు. ఆగిపోయిన కృష్ణా జలాలను వెంటనే సరఫరా చేసి పైపులైన్ నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని, ఏ.కొండూరులో కిడ్నీ ఆసుపత్రి నిర్మించాలని ఈసందర్భంగా గిరిజనులు నినాదాలు చేశారు. ఈకార్యక్రమంలో సిపిఎం నాయకులు బి.జమల మ్మ, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు కుమార్ నాయక్, హరిబాబు, పండు, బి.లక్ష్మి, సోని భూక్య అమల, బాణావతి ఆదిలక్ష్మి, ధారావతు రంగమ్మ తదితరులు పాల్గొన్నారు.




ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న కిడ్నీ బాధితులు, గిరిజనులు



## పిడుగు పడి చెట్టు దగ్ధం

**ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం :** ఇబ్రహీంపట్నం పరిసర ప్రాంతాల్లో మంగళవారం సాయంత్రం నుండి గాలి, ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిచింది. ఈలప్రోలు కొత్తూరు గ్రామంలోని పొలాల్లోని రైస్ మిల్లు వెనుక వైపు ఉన్న తాటిచెట్టుపై పిడుగు పడి చెట్టు మొత్తం కాలిపోయింది. హఠాత్తుగా ఇళ్ళు మధ్యలో గొప్ప వెలుగు రావడంతో స్థానికులు భయాందోళనలకు గురయ్యారు. పొలాల్లో పడి ప్రాణ నష్టం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

# రేపటి నుంచి విద్యుత్ వాహనాల టెక్నాలజీపై వర్క్‌షాప్

**ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ :** నగరంలోని జన శిక్షణ సంస్థాన్‌లో విద్యుత్ వాహనాల టెక్నాలజీపై వర్క్‌షాప్ ఈ నెల 8వ తేదీ నుండి మూడు రోజుల పాటు జరుగుతుందని హాసిని లోకోమోటివ్ సి.ఇ.వో ప్రొఫెసర్ పి.సీ.రెడ్డి తెలిపారు. మొఘల్ రాజపురంలోని జన శిక్షణ సంస్థాన్‌లో మంగళవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ వాహనాల వాడకం విషయంలో యువతకు అవగాహన కల్పించడంతో పాటు, వాహనాలను ఏవిధంగా వినియోగించాలి, వాటి సమస్యలను తెలియచేస్తామని అన్నారు. ఇటీవల విద్యుత్ వాహనాల వినియోగం పెరుగుతుందని, కొన్ని సమస్యలు కూడా వస్తున్నాయని వాటిని అధికమిస్తే వాహనాలను సమర్థవంతంగా వినియోగించవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో జన శిక్షణ సంస్థాన డైరెక్టర్ ఎ.పూర్ణిమ, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రొఫెసర్ పిసి రెడ్డి



## ఈసెట్‌కు 253 మంది హాజరు

**ప్రజాశక్తి - తిరువూరు :** రాష్ట్రవ్యాప్తంగా జెఎన్‌టియు ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఈ-సెట్ ప్రవేశపరీక్షకు తిరువూరు శ్రీవాహిణి ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రానికి మెత్తం 256 మందికి గానూ 253 మంది విద్యార్థులు హాజరైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ రంగా నాగేంద్రబాబు తెలిపారు. ఈ పరీక్షలో ఉత్తీర్ణులైన విద్యార్థులు ఇంజినీరింగ్ ద్వితీయ సంవత్సరంలో అడ్మిషన్ పొందుతారని ప్రిన్సిపల్ చెప్పారు.

# పాఠశాలలు, ఉపాధ్యాయులకు శిక్షా అవార్డులు ప్రదానం

**ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ :** ప్రముఖ స్కూల్ ఎడ్‌టెక్ సంస్థ అయిన లీడ్ గ్రూప్ ఆధ్వర్యంలో ఉత్తమ పాఠశాలలు, ఉపాధ్యాయులకు శిక్షా అవార్డులు మంగళవారం ప్రదానం చేశారు. నగరంలో జరిగిన కార్యక్రమంలో శిక్షా అవార్డులు 2024-25 మూడో ఎడిషన్‌లో లీడ్ గ్రూప్ హెడ్ సుమీత్ మెహతా మాట్లాడుతూ అతిపెద్ద పాఠశాల అవార్డు కార్యక్రమాల్లో ఇది మొదటిదన్నారు. లీడ్ గ్రూప్ ద్వారా నిర్వహించబడే శిక్షా అవార్డులు, విద్యా శ్రేష్ఠత కోసం అవిశ్రాంతంగా కృషి చేస్తూ, విద్యార్థుల అభ్యాస ఫలితాలను మెరుగుపరుస్తున్న విద్య నిపుణులు ఉపాధ్యాయులను గుర్తించి, సన్మానించేందుకు ఉద్దేశించిందన్నారు. ఈ పాఠశాలలు, స్థానం లేదా పరిమాణంతో సంబంధం లేకుండా, జాతీయ విద్యా విధానం (ఎన్ సి ఎఫ్)కు అనుగుణంగా, బహుముఖ బోధన-అభ్యాస పద్ధతులను తమ తరగతి గదులలో ఖచ్చితమైన ప్రణాళిక, శిక్షణ, పర్యవేక్షణ ద్వారా విజయవంతంగా అమలు చేశాయన్నారు. శిక్షా అవార్డుల్లో 2900కు పైగా పాఠశాలలు 29,000కు పైగా ఉపాధ్యాయులు పాల్గొన్నారన్నారు. పాఠశాల అవార్డు విభాగాల్లో జాతీయ విజేతలు, జోనల్ విజేతలు రాష్ట్ర విజేతలు ఉన్నారన్నారు. ఈ అవార్డుల కార్యక్రమం ద్వారా భారతదేశ వ్యాప్తంగా 3000కు పైగా పాఠశాల నిపుణులు విద్యావేత్తలను అవార్డులు గుర్తింపుతో సన్మానిస్తున్నామన్నారు. ఇందులో ఆంధ్రప్రదేశ్‌లో 27 పాఠశాలలు, తెలంగాణలో 28 పాఠశాలలు, పాఠశాలలు ఉన్నాయని చెప్పారు.



అవార్డులు అందుకున్న ఉపాధ్యాయులు